



జనం లేక ఖాళీగా ఉన్న గ్యాలరీలు



జగన్ మాట్లాడుతున్న సమయంలో వెళ్లిపోతున్న జనం

సిద్ధం!

- ఎన్ని చేసినా కదలని జనం
- భారీగా తాయిలాలు.. గ్రాఫిక్స్‌తో జిమ్మిక్కులు
- గ్రామాల్లోనే ఆగిపోయిన కొన్ని వాహనాలు
- మినీ బార్లుగా మారిన బస్సులు
- టార్గెట్‌లో ఒక వంతు కూడా వెళ్లని వైనం
- చివర్లో వేదిక వద్ద తొక్కిసలాటలో కార్మికుడు మృతి

ప్రజలకు నరకం!

- సభకు రాని వారిపై వైసీపీ నేతల దాడి
- ఉదయం నుంచే సాగిన నోటీసుల పర్వం
- జామర్లు పెట్టి నాలుగు గంటలపాటు సిగ్నల్స్ నిలిపివేత
- సిద్ధం సభకు వస్తే తాయిలాలు అంటూ వాట్సాప్ గ్రూపులో మెసేజ్‌లు
- జాతీయ రహదారి గంటల పాటు దిగ్బంధం, నరకం చూసిన ప్రజలు
- ఇన్ని అరాచకాలు చేసినా స్పందన పేలవమే

బాపట్ల, మార్చి10 (ఆంధ్రజ్యోతి): సభకు రానివారిపై దాడి....వాట్సాప్ గ్రూపుల్లో ఏకంగా వైసీపీ నేతలే సభకు వచ్చేవారికి తాయిలాల ఆఫర్...నిరసన తెలిపే అవకాశమున్న వారిపై ఉదయం నుంచే నోటీసుల పర్వం....జాతీయ రహదా రిపై గంటల తరబడి ట్రాఫిక్ దిగ్బంధనంతో వాహనదారుల అవస్థలు...సభలో జరిగే లోటుపాట్లు బయటకు పొక్కకుండా జామర్లు పెట్టి నాలుగు గంటల పాటు సిగ్నల్స్ బంద్...సభా ప్రాంగణంలో మద్యం ఏరులుగా పారించారు...బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం వైసీపీ నిర్వహించిన సిద్ధం సభ విజయవంతం కోసం పాలకపార్టీ చేసిన అరాచకాలివి. సిద్ధం సభ సక్సెస్ కోసం పాలకపార్టీ ఇన్ని చేసినా ఆశించిన స్థాయిలో స్పందన దక్కకపోగా ప్రజలు నరకం చూశారు

అర్ధరాత్రి వరకు నరకం...

జాతీయ రహదారి 16ను ఇరువైపులా ఆదివారం ఉదయం నుంచే సిద్ధం సభ కోసం దిగ్బంధనం చేయడంతో వాహనాదారులతో పాటు సామాన్య ప్రజలు నానా ఇక్కట్లు పడ్డారు. సభ ప్రారంభానికి నాలుగు గంటల ముందు, సభ ముగిసిన తర్వాత అర్ధరాత్రి వరకు ప్రజలు అవస్థలు వర్ణనాతీతం. ముఖ్యంగా చంటిబిడ్డలతో ప్రయాణం చేసే వారు పిల్లలతో నరకం చూశారు. రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో అంబులెన్స్‌లు సైతం దారి కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. సిద్ధం సభకోసం జనాలు లేకపోయినా ఇద్దరు, ముగ్గురు ఉన్నా ఒక బస్సును వేయడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి వాహనాదారులు నానా తిప్పలు పడ్డారు.

ఉదయం నుంచే నోటీసుల పర్వం

కొరిశపాడు మండలం తూర్పుపాలెం గ్రామానికి చెందిన యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం ముంపు గ్రామ రైతులు ఆదివారం సిద్ధం సభ వేదికగా సీఎం దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లాలని భావించారు. వీరంతా సానుభూతిపరులే కావడం గమనార్హం. కానీ ఉదయమే వారికి పోలీసులు నోటీసులు అందించి సభకు రావడానికి వీల్లేదన్నారు. దారి వివాదంలో అనేక విధాలుగా పోరాడుతున్న కొరిశపాడు బొడ్డువానిపాలెంకు చెందిన గొట్టిపాటి సుధారాణికి సైతం పోలీసులు నోటీసులు అందించారు. అదే విధంగా అద్దంకి ఈటీవీ రిపోర్టర్ కొండలకు, యూట్యూబ్ చానల్‌లో పనిచేస్తున్న మరో రిపోర్టర్‌కు పోలీసులు నోటీసులు అందించారు. అద్దంకి యూటీఎఫ్ నాయకులకు, స్థానిక టీడీపీ నేతలకు కూడా నోటీసులు అందించి ప్రజాస్వామిక హక్కులను కాలరాయడాన్ని కొనసాగించారు.

వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు...

సిద్ధం సభ జనసమీకరణ కోసం వైసీపీ చోటామోటా నేతలు వాట్సాప్ గ్రూపుల్లో తాయిలాలు ఆఫర్ చేస్తూ ఆడియో మెసేజ్‌లను పెట్టారు. చీరాల 17వ వార్డుకు చెందిన వైసీపీ నేత ఒకరు సిద్ధం సభకు వచ్చేవారికి రూ.300లతో పాటు బిర్యానీ, పురుషులకు మందు ఆఫర్ చేయడం వైసీపీ జనసమీకరణ కోసం దిగజారిన వైనాన్ని తేటతెల్లం చేసింది. నేతలే కాకుండా వలంటీర్లు కూడా జనాన్ని తరలించడానికి పోటీ పడ్డారు.

జామర్లు పెట్టి నాలుగు గంటల పాటు సిగ్నల్స్ నిలిపివేత

సభలో జరిగే లోటుపాట్లు బయటకు పొక్కకుండా ఉండడానికి ఈ దఫా వైసీపీ కొత్తమార్గాన్ని ఎంచుకుంది. సిద్ధం సభా ప్రాంగణంలో జామర్లు అమర్చి దాదాపు నాలుగుగంటల పాటు అక్కడి జనానికి బాహ్యప్రపంచానికి సంబంధాలు తెంచేసింది. గతంలో జరిగిన సిద్ధం సభలో లక్షల మంది జనం అని పాలకపార్టీ ఊదరగొడుతుంటే సెల్ టవర్ ఆధారంగా ఒరిజినల్‌గా సభకు హాజరైన జనం సంఖ్యను గణాంకాలతో టెకీ నిపుణులు ఎండగట్టారు. అధికారపార్టీ చెప్పే సం ఖ్యకు అక్కడ వాస్తవంగా హాజరైన జనానికి పొంతనలేకపోవడంతో వైసీపీ ఈసారి సిగ్నల్స్ నిలిపేసే కొత్తఎత్తుగడకు తెరలేపిందని తెలుస్తోంది.

సభకు రానివారిపై దాడులు...

జె.పంగలూరు మండలం రామకూరు గ్రామంలో వైసీపీ నేతలు అరాచకానికి తెగబడ్డారు. వ్యవసాయ పనులు ఉండడం వల్ల సిద్ధం సభకు రాలేనని చెప్పినందుకు ధన చక్రవర్తి అనే వ్యక్తిపై వైసీపీ నేతలు దాడికి తెగబడ్డారు. మిర్చికోతలు ఉండడం వల్ల సిద్ధం సభకు రాలేనని ఆ రైతు చెప్పినప్పటికీ కనికరం లేకుండా కర్రలు, రాడ్లతో వైసీపీ నేతలు దాడి చేయడం పాలకపార్టీ సిద్ధం సభ సక్సెస్‌కోసం చేసిన దౌర్జన్యాలకు పరాకాష్టగా నిలిచింది.

ఏరులై పారిన మద్యం...

సిద్ధం సభా ప్రాంగణంలో ఏ మూలకు వెళ్లినా మద్యం ఏరులై పారుతున్న దృశ్యాలే కనిపించాయి. ఏకంగా బీరు బాటిళ్లను బహిరంగంగా అమ్మకాలు కూడా కొనసాగించడం బరితెగింపుకు పరాకాష్టగా నిలిచింది. పలుచోట్ల మద్యం మత్తులో ఉన్న ప్రజలు రోడ్డమీద పడి ఉండి కనిపించడం సిద్ధం సభకోసం వైసీపీ ఏ స్థాయిలో మద్యం పారించిందో తెలుస్తోంది.

రాష్ట్రం నలుమూలల నుంచి బస్సులు

సిద్ధం సభ కోసం ఆర్టీసీ బస్సులను ఇష్టారాజ్యంగా వైసీపీ వాడి పడేసింది. సభ ప్రాంగణం నుంచి పదికిలోమీటర్లులేని ఊళ్లకు కూడా మూడేసి ఆర్టీసీ బస్సులను వైసీపీ నేతలు పంపించారు. వింతగా ఆయా గ్రామాలకు తరలించిన బస్సులనీ కాకినాడ, భీమవరం, రాజమండ్రి డిపోలకు చెందినవిగా ఉన్నాయి. అద్దంకి, చీరాల డిపో బస్సులను వేరే ప్రాంతాలకు పెట్టారు. ఆర్టీసీ బస్సులను ఇలా వాడడమే తప్పయితే తలాతోక లేని నిర్ణయాలతో డీజిల్ లక్షల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ ఆర్టీసీని మరింత ఊబిలోకి నేట్టేసే పాపం వైసీపీ మూటగట్టుకుంటుంది.

ఇన్ని చేసినా స్పందన పేలవమే...

సభ కోసం వైసీపీ తనకున్న ఆర్థిక, అంగబలాలతో పాటు ప్రభుత్వవ్యవస్థల దుర్వినియోగానికి తెగబడిన జనం స్పందన మాత్రం పేలవంగానే ఉంది. వందల ఎకరాల్లో సభ అంటూ ఊదరగొట్టినా అంతా కలిపి 50 ఎకరాల్లోపే సభా ప్రాంగణం పరిమితమవడం, హాజరైన జనం కూడా రెండు లక్షల్లోపే నని అంచనాలు వెలువడడంతో సిద్ధం సభ జనానికి వెతలను మిగల్చాడానికే పెట్టినట్లయింది.



సభకు వెళ్లే దారిలో రోడ్డుమీదే బీర్ల అమ్మకాలు



సీఎం సభకు వెళ్తూ మార్గమధ్యమైన ఒంగోలులో మద్యం సేవిస్తున్న వైసీపీ కార్యకర్తలు

విఫలం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు



వైసీపీ ఆదివారం ఉమ్మడి జిల్లాలోని మేదరమెట్ల సమీపంలో నిర్వహించిన సిద్ధం సభకు జనం నుంచి స్పందన కరువైంది. వైసీపీ నాయకులు సామ,దాన,భేద దండోపాయాలను ప్రయోగించినా, వలంటీర్లను పూర్తిగా రంగంలోకి దింపినా ఫలితం కన్పించలేదు.

మరోవైపు వైసీపీలోని అంతర్గత కలహాలు బహిర్గతమయ్యాయి. ఇద్దరు ఎమ్మెల్యేలు, పలువురు కిందిస్థాయి నాయకులు, వారి అనుచరులు సభకు దూరంగా ఉండిపోయారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాకు వైసీపీ అధిష్ఠానం ఇచ్చిన టార్గెట్‌లో ఒకవంతు కూడా జనసమీరణ జరక్కపోగా వెళ్లిన వారిలో ఎక్కువ మంది సభకు దూరంగా ఉండటం, కొద్దిసేపటికే తిరుగు ప్రయాణం కావడం స్పష్టంగా కనిపించింది. ఇతర జిల్లాల నుంచి కూడా ఆశించిన మేర జనం రాకపోవడం వైసీపీ అగ్ర నేతలను నిరాశకు గురిచేసింది. కొన్ని గ్రామాల్లో వాహనాల్లోకి అసలు పార్టీ శ్రేణులు ఎక్కకపోగా, మరికొన్ని గ్రామాల్లో పార్టీలోని అసమ్మతి వాదులు వచ్చిన వాహనాలకు అంతరాయాలు కల్గించడం లాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. మధ్యలో ఒకట్రెండు చోట్ల సభకు రాని వారిపై వైసీపీ నేతలు బెదిరింపులకు పాల్పడ్డారు. సభలో జగన్ ప్రసంగం అనంతరం ఆయన వద్దకు చొచ్చుకుపోయేందుకు ముందుభాగంలో ఉన్న యువకులు పోటీ పడగా ఆ ఒత్తిడిలో ఒంగోలుకు చెందిన మున్సిపల్ కార్మికుడు మృతి చెందడం విషాదకరం.

రాష్ట్రంలో భారీగా సిద్ధం సభల నిర్వహణ ద్వారా ఎన్నికల సమరానికి అధికార వైసీపీ శ్రీకారం పలికింది. అందులో భాగంగా ఆఖరు సభ ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మండల కేంద్రమైన కొరిశపాడు సమీపంలో నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి భారీగా జనసమీకరణకు ప్రయత్నించారు. వైసీపీ రాష్ట్ర నాయకత్వం నియోజకవర్గాలవారీ నాయకులపై ఒత్తిడి పెంచి టార్గెట్లు ఇచ్చి భారీ జనసమీకరణకు ఆదేశించింది. ఆమేరకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన స్థాయిలో సభ విజయవంతం కాకపోవడంతో ఆపార్టీ నాయకులు కూడా నిర్ఘాంతపోయారు. ఆ సభ నిర్వహణ పేరుతో ఉదయం నుంచి సాయంత్రం వరకు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిపివేయడం, ఆర్టీసీ బస్సుల న్నింటినీ జనసమీకరణకు పంపడం తో సాధారణ ప్రయాణికులు నరకయాతనకు గురయ్యారు.

సుమారు 15 లక్షల మంది హాజరవుతారని ప్రకటించుకోగా అందులో ఒకవంతు కూడా రాలేదు. ఆయా నియోజకవర్గాల్లో కిందిస్థాయి నాయకుల్లో చాలామంది సిద్ధం సభకు దూరంగా ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌తో పాటు కనిగిరి, గిద్దలూరు, పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు, కొండపి తదితర నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికతో అసంతృప్తితో ఉన్న పలువురు నాయకులు, ఆ పార్టీ ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు కూడా సభకు గైర్హాజరయ్యారు.

భారీగా తాయిలాలు ఇచ్చినా...

జనసమీకరణకు సర్వశక్తులు ఒడ్డిన వైసీపీ నేతలు సభకు వచ్చేవారికి కొన్ని ప్రాంతాల్లో ఒక్కొక్కరికి రూ.300, మరికొన్ని ప్రాంతాల్లో రూ.500 ప్రకారం చెల్లించారు. ఇక మద్యం, పలావు పొట్లాలు అయితే అన్ని ప్రాంతాల్లో ఇచ్చారు. ఇవన్నీ కలుపుకుంటే రవాణా ఖర్చులు కాకుండా ఒక్కొక్కరికి రూ.800 నుంచి రూ.1000 వరకు వెచ్చించారు. అయినా వైసీపీ నాయకులు ఆశించిన స్థాయిలో ప్రజలు వాహనాలు ఎక్కలేదు. అనేక ప్రాంతాల్లో సర్పంచ్‌లు.. 'మాకు జగన్ అన్యాయం చేశారే తప్ప అభివృద్ధికి సహకరించలేదు. సభకు మేము రాము. మా అనుచరులనూ పంపం' అని ఎదురుతిరిగారు.

బస్సుల్లోనే మద్యం తాగి చిందులు

ఇక నలభై మంది పట్టే బస్సులో 10 మంది 5 మంది వచ్చిన వాహనాలు చాలా ఉన్నాయి. అయితే ప్రతి ప్రాంతంలోనూ పురుషులనే అధికంగా సమీకరించేందుకు ప్రయత్నించారు. మహిళలు వచ్చినా ప్రత్యేక వాహనం ఎక్కించారు. పురుషులు ఉన్న వాహనాలన్నీ మినీ బార్లుగా మారిపోయాయి. మహిళలు ఎక్కువ మంది ప్రాంగణానికి దూరంగా చెట్ల కింద కూర్చుని కనిపించారు. అదేమిటని ప్రశ్నిస్తే 'డబ్బులు ఇచ్చారు వచ్చాం. తిరిగి వెళ్లేటప్పుడు వెళ్లిపోతాం. ఆ సభతో మాకెందుకు' అని స్పష్టంగా చెప్పారు.

ఫలించని బెదిరింపులు

వైసీపీ నేతల బెదిరింపులు కూడా ఫలించలేదు. ఒకవైపు వలంటీర్లకు డబ్బులు, బహుమలు ఇచ్చి జనాన్ని సమీకరించమని ఒత్తిడి చేశారు. డ్వాక్రా సంఘాల గ్రూపుల నాయకులకు అలాంటి ఆదేశాలే ఇచ్చారు. గ్రామాల్లో సాధారణ ప్రజలపై అయితే వైసీపీ నాయకులు దౌర్జన్యంగా వ్యవహరించారు. పంగులూరు మండలం రామకూర్‌లో చక్రవర్తి అనే యువకుడు సభకు రాకపోవడమే కాక తన పొలంలో పనిచేసేవారిని పంపకపోవడంతో గ్రామంలోని వైసీపీ నాయకులు ఆయన్ను రక్త గాయాలయ్యేలా కొట్టారు.

ఫలించని జిమ్మిక్కులు

సభకు భారీగా జనం వచ్చినట్లు చూపేందుకు గ్రాఫిక్ జిమ్మక్కులకు వైసీపీ నాయకులు పాల్పడ్డారు. సీఎం జగన్ రాకముందు సభా ప్రాంగణంలో రెండో డ్రోన్ కెమెరా దృశ్యాలు చిత్రీకరిస్తుంటే అది నారా లోకేష్ పని అంటూ మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. చివరకు పోలీసులు ఆ డ్రోన్ కెమెరా వైసీపీ అధికారిక సంస్థ అయిన ఐప్యాక్‌దని తేల్చేశారు.

టార్గెట్‌లో ఒక వంతు మాత్రమే

జిల్లా నుంచి కనీసం ఐదు లక్షల మందిని సమీకరించాలని వైసీపీ భావించింది. ప్రధానంగా అద్దంకి, పర్చూరు, చీరాల నుంచి అధికంగా తరలించాలని ఆదేశించారు. కానీ ఆమూడు నియోజకవర్గాల నుంచి వారు ఆశించిన స్థాయిలో పార్టీశ్రేణులు కానీ, ప్రజలు కానీ హాజరుకాలేదు. ఇతర నియోజకవర్గాల నుంచి అధిష్ఠానం ఇచ్చిన టార్గెట్‌లో ఒకవంతు మాత్రమే వచ్చారు. కొన్ని నియోజకవర్గాల్లో రెండు నుంచి ఐదు వేలమంది, మరికొన్ని సెగ్మెంట్‌లలో పది నుంచి పదిహేను వేల మంది, ఒకట్రెండు నియోజకవర్గాల నుంచి 20వేల ప్రకారం సమీకరణ జరిగింది. సరాసరి లక్షపైచిలుకు జిల్లా నుంచి సమీకరించగా, ఇతర జిల్లాల నుంచి మరో లక్ష వచ్చి ఉంటారని అంచనా వేస్తున్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతి

సభ ముగిసిన తర్వాత ముందు వరుసలో ఉన్నకార్యకర్తలు జగన్‌ను దగ్గరగా చూసేందుకు, వీలైతే కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు. ఆ సమయంలో ఒంగోలు మునిసిపాలిటీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న మురళి తీవ్ర ఒత్తిడికి గురై మృతి చెందాడు. అదేవిధంగా సిద్ధం సభకు వచ్చిన నరసరావుపేట పట్టణంలోని స్టేడియం ఎదురు చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన గేదెల బాల దుర్గారావు (27) తిరిగి వెళ్లే సమయంలో బస్సు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

- హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహాం సందేశం
- ముగిసిన గుడారాల పండుగ

దేవుని స్తుతిస్తే అధిక మహిమ



సందేశమిస్తున్న హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహాం



హాజరైన విశ్వాసులు

గుంటూరు(తూర్పు), మార్చి10: వాక్యాన్ని ధ్యానించాలి, ఇంటింటికి చెప్పాలి, అప్పుడే ఏసయ్య హృదయాన్ని తాకుతాడు అని హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహాం సందేశమిచ్చారు. గోరంట్ల సమీపంలో హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 47వ అంతర్జాతీయ గుడారాల పండుగ ఆదివారం మధ్యాహ్నం ముగిసింది. చివరి రోజు ప్రార్థనలను పాస్టర్ జేమ్స్ ప్రారంభించారు. మనసు హిమం వలే పరిశుద్ధంగా ఉండాలి, క్రీస్తు మాటలు సువాసన కలిగి ఉన్నాయి, క్రీస్తు మనలను సువర్ణంగా మార్చును అని చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ సందేశమి చ్చారు. తొలుత హోసన్నా మినిస్ట్రీస్ పాస్టర్లు, సిస్టర్లు పరలోక తేజస్సు అనురాగ పూర్ణుడా, గోత్రపు సింహమా అనే స్తుతి గీతాలు అలరించాయి. హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహాం ముగింపు సందేశానిస్తూ దేవుని మహిమ అధికంగా మనుషులపై ఉందని వాక్యోపదేశం చేశారు. గుడారాల పండుగకు వచ్చిన భక్తులు క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాం క్షించారు. ఈ సందర్భంగా గుడారాల పండుగ విజయవంతం అయ్యేందుకు సహకరించిన ప్రభుత్వ శాఖలను నిర్వాహకులు, పాస్టర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముగింపు కార్యక్రమంలో భాగంగా పాస్టర్లు ప్రాంగణమంతా తిరుగుతూ విశ్వాసులకు క్రీస్తు ఆశీర్వచనాలను అందించారు. గుడారాల పండుగ ముగియడంతో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది విశ్వాసులు తమ స్వస్థలాలకు బయలుదేరి వెళ్లారు.

అమరావతిలో కొలువైన బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి వారి దివ్యరథోత్సవ సంబరం ఆది వారం అంబరాన్ని తాకింది. బాల చా ముండికా సమేత అమరేశ్వ ర స్వామి ఉత్సవమూ ర్తులను ప్రత్యే కంగా అలంకరించిన దివ్యరథం పై ఉంచారు. రథోత్స వాన్ని ఆలయ అధికారి వేమూరి గోపి, ఉత్సవ అధికారి సైదమ్మ బాయి టెంకాయ లు కొట్టి సాయంత్రం 4.53 గంటలకు ప్రారంభిం చారు. ఉత్సవమూర్తుల విగ్రహాలను పూజలు నిర్వహించి దివ్యరథం పైకి చేర్చారు. వేలాదిమంది భక్తులు రథం మోకును పట్టుకుని శం భోశంకర సాంబశివ.. అంటూ రథాన్ని ముందు కు లాగుతూ కార్యక్రమా న్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. రథోత్సవానికి ముందు కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, మంగళవాద్యాలు భక్తులను అలరించాయి. డీఎస్పీ పర్యవేక్షణ లో సీఐలు, ఎస్ఐలు తమ సిబ్బంది తో కలసి విధులు నిర్వహిం చి రథోత్సవాన్ని ప్రశాంతంగా ముగించారు.

- అమరావతి

హరహర మహాదేవ

- అంబరాన్ని తాకిన అమరేశ్వరుని రథోత్సవం



రథోత్సవానికి హాజరైన భక్త జన సందోహం



విశేష అలంకరణలో అమరేశ్వరస్వామి

గుంటూరు - గుంతకల్లు రైల్వే డబ్లింగ్‌లో...

నాలుగు సెక్షన్లు జాతికి అంకితం

- 12న వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న పీఎం మోదీ
- పశ్చిమ వైపున కోచ్ రెస్టారెంట్ అందుబాటులోకి తీసుకురానున్న రైల్వే



మాట్లాడుతున్న డీఆర్ఎం ఎం రామకృష్ణ

గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - గుంతకల్లు రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులో నిర్మాణం పూర్తి అయిన నాలుగు సెక్షన్లను ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయనున్నారు. ఈ నెల 12వ తేదీన ఆయన గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.రామకృష్ణ తెలిపారు. ఆదివారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. సాతులూరు - మునుమాక మధ్యన 16 కిలోమీటర్ల పొడవునా రూ.144 కోట్లతో రెండో రైలుమార్గం నిర్మాణం జరిగింది. ఇందుకోసం సాతులూరులో పొడవైన లూప్ కూడా నిర్మించారు. శావల్యాపురం - చీకటీగలపాలెం మధ్యన 17 కిలోమీటర్ల పొడవునా రూ.153 కోట్లు ఖర్చు చేసి పూర్తి చేశారు. జగ్గంబొట్ల కృష్ణాపురం - గిద్దలూరు మధ్యన 25 కిలోమీటర్ల పొడవునా రూ.225 కోట్లు, తర్లుపాడు - జగ్గంబొట్ల కృష్ణాపురం మధ్యన 21 కిలోమీటర్ల పొడవునా రూ.189 కోట్లను రెండో మార్గం కోసం ఖర్చు చేసి పూర్తి చేశారు. దీంతో గుంటూరు నుంచి గిద్దలూరు వరకు రెండో రైలుమార్గం అందుబాటులోకి వచ్చింది. గిద్దలూరు - దిగువమెట్ట సెక్షన్ కూడా శరవేగంగా నిర్మాణం జరుగు తుందని, ఆ తర్వాత దిగువమెట్ట - నంద్యాల మధ్యన డబ్లింగ్ చేస్తామని డీఆర్ఎం చెప్పారు. కాగా పూర్తి అయిన నాలుగు సెక్షన్లను ప్రధాని మోదీ మంగళవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభిస్తారన్నారు.

ఇవికాక తుమ్మలచెరువులో నిర్మించిన మెస్సర్స్ చెట్టినాడ్ సిమెంట్స్ కార్పొరేషన్ ప్రైవే టు లిమిటెడ్ గతి శక్తి కార్గో టెర్మినల్, తిప్పర్తిలో నిర్మాణం చేసిన మెస్సర్స్ సాయిబా లాజీ వేర్‌హౌసింగ్, లాజిస్టిక్స్ ప్రైవేటు లిమి టెడ్ జీసీటీని కూడా ప్రధాని ప్రారంభిస్తారు. వీటి వలన పెద్దఎత్తున సరుకు రవాణ జరిగి రైల్వేకు ఆదాయం సమకూరుతుందని డీఆర్ ఎం పేర్కొన్నారు. అలానే రేపల్లె, గుంటూరు, నరసరావుపేట, కంభం, గిద్దలూరు, నంద్యాల, నల్గొండలో ఏడు ప్రదేశా లలో ఒన్ స్టేషన్ ఒన్ ప్రొడక్ట్ అవుట్‌లెట్లను కూడా పీఎం ప్రారంభిస్తారని చెప్పారు. గుంటూరు రైల్వేస్టేషన్ పశ్చిమ వైపున నూతనంగా సకల హంగులతో నిర్మించిన కోచ్ రెస్టారెంట్‌ని కూడా మంగళవారం ప్రారం భించనున్నట్లు చెప్పారు సమావేశంలో డీసీఎం కమలాకర్‌బాబు, సీనియర్ డీఈఎన్ వెస్లు గౌతం పాల్గొన్నారు.

దిక్సూచి DIKSUCHI

ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయెన్స్

కరెంట్ అఫైర్స్ /జనరల్ ఎస్సే

చిరుతపులి, పులి అంటే ఎవరికైనా భయమే! ఒక్కోసారి ఇటువంటి క్రూరమృగాలు అడవులకు సమీపంలో ఉండే గ్రామాలపై దాడి చేసి జంతువులకు, మనుషులకు హాని కలిగిస్తుంటాయి. అలాంటి క్రూరమృగాలను ప్రత్యేకంగా సంరక్షించడం ఎందుకు? అనే సందేహం చాలామందికి కలగవచ్చు. నిజానికి పులి, చిరుత పులి వంటి ఆహార గొలుసులోని పై స్థాయి జంతువులు- జీవ వైవిధ్యాన్ని, ప్రకృతి సమతౌల్యాన్ని కాపాడడంలో కీలకంగా వ్యవహరిస్తాయి. ఉదాహరణకు పులి, చిరుతపులి వంటి జీవులు అంతరించిపోతే గడ్డిమేసే జంతు జనాభా విపరీతంగా పెరిగి అటవీ భూముల్లో గడ్డి, చిన్నపాటి మొక్కలు కనుమరుగౌతాయి. దానితో పర్యావరణం, జీవావరణం దెబ్బతిని వర్షాభావ పరిస్థితులు తలెత్తడం, నేలలో తేమ తగ్గడం వంటి విపరిణామాలకు దారితీస్తుంది. అందుకే ప్రకృతి సమతుల్యాన్ని కాపాడాలంటే అంతరించిపోతున్న పులి జాతుల జనాభాను పరిరక్షించాల్సి ఉంది.

- ఇందుకోసం 1973లోనే పులుల సంరక్షణకు భారత ప్రభుత్వం 'ప్రాజెక్ట్ టైగర్'ను చేపట్టింది. పులుల ఆవాసాల సంరక్షణకు వాటి వేట నిరోధానికి స్థానిక గిరిజన జాతుల ప్రజలను, అటవీ పరిసర గ్రామాల ప్రజలను కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వాములను చేస్తూ పులుల సంరక్షణ ఆవశ్యకతపై వారిలో అవగాహన పెంచుతోంది.
- 2006-19 మధ్యకాలంలో ప్రభుత్వం పులుల సంఖ్యను పెంచడంపై ప్రత్యేక శ్రద్ధ వహించింది. టైగర్ ఇనీషియేటివ్ కార్యక్రమం ద్వారా పులుల సంఖ్యను రెండింతలు చేసింది. 2010లో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నిర్వహించిన టైగర్ సమ్మిట్‌లో భారత ప్రధాని మోదీ 2022 నాటికి ప్రపంచంలోని అడవుల్లో గల పులుల జనాభాను రెండింతలు చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. 2022లో భారతదేశం ఆతిథ్యం ఇచ్చిన పులుల సంరక్షణపై ఆసియా దేశాల మంత్రుల రెండో సమావేశం(సెకండ్ ఏషియా మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ ఆన్ టైగర్ కన్జర్వేషన్)'లో బిగ్ క్యాట్స్‌గా పిలిచే పులి, చిరుతపులి వంటి పులి జాతి జంతువుల సంరక్షణకు ఒక అంతర్జాతీయ కూటమిని ఏర్పాటు చేయాలని టైగర్ రేంజ్ కంట్రీస్(పులుల జనాభా గల దేశాలు) ఒక సూత్రప్రాయ అంగీకారానికి వచ్చాయి. 2023 ఏప్రిల్‌లో మైసూర్‌లో జరిగిన ప్రాజెక్ట్ టైగర్ 50 వసంతాల కార్యక్రమం సందర్భంగా ప్రధాని మోదీ 'ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ ఎలయెన్స్' ఏర్పాటును ప్రకటించారు.
- 2023 మార్చి 1న భారత రాజధాని న్యూఢిల్లీ హెడ్ క్వార్టర్‌గా ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ ఎలయెన్స్(ఐబీసీఏ) ఏర్పాటుకు ఆమోదం లభించగా 2024 ఫిబ్రవరి 29న అధికారికంగా క్యాబినెట్ ప్రకటన వెలువడింది.

ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయెన్స్ అంటే?

- ఆహారపు గొలుసులో పై భాగంలో ఉండే ప్రిడేటర్స్ జాతులకు (బిగ్ క్యాట్‌గా పిలిచేవి) చెందిన ఏడు రకాల జీవులు- సింహం, పులి, చిరుతపులి, స్నోలెపర్డ్, లెపర్డ్, జాగ్వార్, ప్యూమా జాతి వన్యమృగాల సంరక్షణ, పరిరక్షణ కోసం పరస్పర సహకారం అందించుకొనేందుకు ఏర్పాటైన కూటమి 'ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ ఎలయెన్స్'.
- ఈ కూటమిలో 97 బిగ్ క్యాట్ రేంజ్ కంట్రీస్(ఈ ఏడు జాతుల వన్యమృగాలు గల దేశాలు)తోపాటు అనేక ఏజెన్సీలు, ఔత్సాహిక దేశాలు కూడా భాగస్వాములుగా ఉంటాయి. అంటే ఇది 'మల్టీ కంట్రీ-మల్టీ ఏజెన్సీ కొయిలేషన్'గా చెప్పవచ్చు. భారతదేశంలో ఈ ఏడు బిగ్ క్యాట్ జాతుల్లో రెండు జాతులు (ప్యూమా, జాగ్వార్) మినహా మిగిలినవన్నీ మనుగడ సాగిస్తున్నాయి. భారత్‌తోపాటు ఈ కూటమిలో నేపాల్, బంగ్లాదేశ్, చైనా, భూటాన్ వంటి ఇతర ఆసియా దేశాలతోపాటు కొన్ని మధ్య ప్రాచ్యదేశాలు; ఉత్తర, దక్షిణ అమెరికా ఖండ దేశాలు; కాంబోడియా, మలేషియా, వియత్నాం, థాయ్‌లాండ్, లావో వంటి ఆగ్నేయాసియా దేశాలు; మరినామ్, ఇథియోపియా, కెన్యా, నైజీరియా, అర్మేనియా, టాంజానియా వంటి ఆఫ్రికా ఖండ దేశాలు భాగస్వాములుగా ఉండనున్నాయి. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్(ఐయూసీఎన్), స్నోలెపర్డ్ ట్రస్ట్, అముర్ టైగర్ సెంటర్ ఈ కూటమిలో చేరేందుకు ఆసక్తి తెలిపాయి.

ఐబీసీఏ లక్ష్యాలు

- అనుసంధాన వేదికగా ఐబీసీఏ సభ్యదేశాల మధ్య సమాచార, విజ్ఞాన మార్పిడికి సాంకేతిక సహకారానికి తోడ్పాటునందించడం
- సరిహద్దు అడవుల్లో ఇరుగు పొరుగు దేశాలు ఉమ్మడిగా చర్యలు చేపట్టేందుకు, పర్యవేక్షణ ఒప్పందాలకు సహకరించడం
- శాస్త్రీయంగా దత్తాంశాల సేకరణకు కావాల్సిన టెక్నాలజీని సాంకేతిక పరికరాలను సభ్య దేశాల మధ్య బదిలీ చేయడం
- భద్రతా దళాల మధ్య అనుసంధానత పెంచడం ద్వారా వన్య ప్రాణుల అక్రమ రవాణాను ప్రపంచవ్యాప్తంగా అరికట్టడం
- వివిధ దేశాలు, వివిధ ఏజెన్సీలు, వివిధ స్థానిక కమ్యూనిటీలు, అనుభవజ్ఞుల మధ్య అనుసంధానత పెంచడం ద్వారా వారి అనుభవాలు; సాంప్రదాయక, వైవిధ్య వ్యూహాలను పరస్పర పంపిణీకి వీలు కల్పించి అంతరించే దశకు చేరుకుంటున్న బిగ్ క్యాట్ జాతులను పరిరక్షించడం.
- పర్యావరణాన్ని, జీవ వైవిధ్యాన్ని రక్షించి సుస్థిరాభివృద్ధికి బాటలు వేయడం



నిధుల సమీకరణ: వ్యవస్థాపక దాతగా భారతదేశం రూ.150 కోట్లను వన్ టైం బడ్జెటరీ సపోర్ట్‌గా వెచ్చించనుంది. రాబోయే అయిదేళ్ల కాలంలో (2028 వరకు) ఢిల్లీలో ఐబీసీఏ సెక్రటేరియెట్‌ను ఏర్పాటు చేయడం, ప్రాజెక్ట్ కార్యక్రమాలను నిర్వహించడం కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేయనుంది. ఇతర సభ్యదేశాలు కూడా కాలానుగుణంగా నిధులపరంగా, సాంకేతిక సహాయాల పరంగా సహకరించనున్నాయి.

ఐబీసీఏను భారత్‌లో ఏర్పాటు చేయడానికి కారణాలు: ప్రపంచవ్యాప్తంగా ఉన్న అడవుల్లో గల పులుల జనాభాలో 50 శాతం వరకు భారతదేశ అడవుల్లోనే ఉన్నాయి. 2006-19 మధ్య కాలంలో పులుల సంఖ్యను రెండింతలు చేసిన ఘనత, అనుభవం భారత్‌కు ఉన్నాయి. ప్రాజెక్ట్ టైగర్‌లో భాగంగా గత 50 ఏళ్లుగా ప్రజల భాగస్వామ్యంతో పులుల వేటను అరికట్టడంలోనూ; గిరిజనుల భద్రత, జీవనోపాధికి భంగం కలుగకుండా అటవీ ఉత్పత్తులను సేకరించడంలోనూ; పులుల ఆవాసాలకు భంగం కలగకుండా మనుషులు మసలుకునే వ్యూహాలను అమలుపరచడంలోనూ; అటవీ సరిహద్దు ప్రాంత ప్రజలను పులుల సంరక్షణ పరంగా జాగృతం చేయడంలోనూ; పులుల వేటను నిరోధించి వాటి శరీర భాగాల వ్యాపారాలను అడ్డుకోవడంలోనూ భారత్‌కు విస్తృతమైన అనుభవం ఉంది.

ఐబీసీఏ నిర్మాణం

- ఐబీసీఏకు భారతదేశం ప్రధాన కేంద్రంగా ఉంటుంది. ఇక్కడ ఒక సెక్రటేరియెట్ కూడా ఏర్పాటవుతుంది.
- ఐబీసీఏలో అసెంబ్లీ మెంబర్స్, స్టాండింగ్ కమిటీ ఏర్పాటును ప్రతిపాదించారు.
- భారత పర్యావరణ మంత్రిత్వ శాఖ ఐబీసీఏ సెక్రటేరియెట్‌కు ఒక తాత్కాలిక డైరెక్టర్ జనరల్‌ను నియమిస్తుంది
- కూటమి సభ్యదేశాలు సమావేశమై రోజువారీ విధి నిర్వహణ కోసం ఒక అధికారిక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసే వరకూ తాత్కాలిక డైరెక్టర్ జనరల్ ఈ బాధ్యతలు నిర్వహిస్తారు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

కుషాణుల రాజకీయ, సాంస్కృతిక చరిత్ర

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ హిస్టరీ

భారతదేశ చరిత్రలో కుషాణుల ప్రాముఖ్యం చాలా ఉంది. శక సంవత్సరాన్ని క్రీ.శ.78 మార్చి 22న కనిష్కుడు ప్రారంభించాడు. దీనినే శక క్యాలెండర్‌గా భావిస్తారు. కుషాణుల వంశంలో కనిష్కుడు గొప్పవాడు. ఇతనికి దేవపుత్ర, సీజర్, రెండో అశోకుడు అనే బిరుదులు ఉన్నాయి.

కుషాణుల చరిత్రకు ఆధారాలు: తొలి, మలి 'హన్‌వంశ' చరిత్రలు, బాక్ట్రియాలోని రాయబారి 'చాంగ్‌కెన్' రచనలు, హిందూ పురాణాలు, కల్హణుడు రాసిన 'రాజతరంగిణి'(కశ్మీర్‌ను పాలించిన రాజుల చరిత్ర), అశ్వఘోషుడు రాసిన 'మాధ్యమిక సూత్రం' మొదలైన గ్రంథాలు.

కుషాణుల రాజకీయ చరిత్ర: వీరు చైనాలోని 'యూచీ' తెగకు చెందిన వారు. వీరి స్వస్థలం చైనాలోని 'హుయాంగ్‌హూ' నదీ తీర ప్రాంతం. కుషాణులు చైనాలో 'హియాంక్' తెగ చేతిలో ఓడిపోయి భారత్‌కు వలస వచ్చారు. ఇక్కడి శకరాజులను ఓడించి స్థిరపడ్డారు. వీరు ఆక్రమించిన రాజ్యాన్ని ఐదు భాగాలుగా విభజించారు.

కుజుల కాడ్ఫిసెస్: ఇతడు రాజ్య స్థాపకుడు. ఇతడు నాలుగు యూచీ తెగలను ఓడించి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. శకులను ఓడించి, వారు నివసించిన ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పాటు చేశాడు. వివాహ సంబంధాల ద్వారా రాజ్యాన్ని విస్తరించాడు. కుషాణులు, శకులు కలిసిపోయారు.

కుజుల కాడ్‌ఫైజ్: క్రీ.శ.15లో రాజ్యానికి వచ్చాడు. ఇతని తర్వాత విమాకాడ్‌ఫైజ్ పాలనలోకి వచ్చాడు. ఇతను క్రీ.శ.65 నుంచి 75 వరకు పాలించాడు. ఇతని విగ్రహంపై 'కుషాణ పుత్రషాహి విసుతకమ' అని ఉంది. విమాకాడ్‌ఫైజ్ తండ్రి కాలంలోనే గాంధార ప్రాంతంతోపాటు, పంజాబ్, మధుర, వారణాసి వరకు జయించాడు. చివరకు చైనా వాళ్ల చేతిలో ఓడిపోయాడు. రోమన్ చక్రవర్తి ఆస్థానానికి విమాకాడ్‌ఫైజ్ రాయబారిని పంపాడు. వర్తక వాణిజ్యాలు, వర్తక సంబంధాలు ఏర్పరచుకున్నాడు. ఇతని కాలంలోనే వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు, వజ్రాలు రోమ్‌కు ఎగుమతి అయ్యేవి. దీనికి బదులుగా భారత్‌కు రోమ్ నుంచి 'బంగారు నాణేలు' దిగుమతి అయ్యాయి అని ప్లీని 'ద ఎల్డర్' అనే పుస్తకంలో పేర్కొన్నాడు. విమాకాడ్‌ఫైజ్ శైవమతాన్ని స్వీకరించినట్లు అతని నాణేలపై కన్పించే త్రిశూల ధారి, శివమూర్తి, నంది వాహనం బట్టి తెలుస్తోంది. ఇతనికి రాజాధిరాజా, మహారాజా అనే బిరుదులు ఉండేవి. ఇతని రాజధాని పురుషపురం లేదా పెషావర్. రెండో రాజధాని మధుర.

కనిష్కుడు : ఈ వంశంలో గొప్పవాడు. క్రీ.శ.78లో పాలనలోకి వచ్చాడు. ఈ సందర్భంగానే ఇండియన్ క్యాలెండర్ క్రీ.శ.78 మార్చి 22న ప్రారంభమైంది. కనిష్కుడు గొప్ప యోధుడు. ఇతడు కశ్మీర్‌ను జయించి తన రాజ్యంలో విలీనం చేశాడని కల్హణుడు తన 'రాజతరంగిణి'లో, ఆల్ బెరూని 'కితాబ్-ఇ-హింద్'లో పేర్కొన్నారు. ఇక్కడి నుంచే కనిష్కుడు అశ్వఘోషుడిని తన ఆస్థానానికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఉజ్జయినిలో ఉన్న పశ్చిమ క్షాత్రపులను ఓడించి 'మాళ్వా' ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

నాలుగో బౌద్ధమత సమావేశం: ఈ సమావేశాన్ని కశ్మీర్‌లోని కుందలవనంలో నిర్వహించాడు. వసుమిత్రుడిని అధ్యక్షుడిగా, అశ్వఘోషుడిని ఉపాధ్యక్షుడిగా నియమించాడు. వసుమిత్రుడు 'మహా విభాష్యం' రచించాడు. అశ్వఘోషుడు 'సౌందర్యనందం', 'సారీపుత్ర ప్రకరణం', 'వజ్రసూచీ' మొదలైన గ్రంథాలు రచించాడు. కనిష్కుని ఆస్థానంలో చరకుడు అనే గొప్ప వైద్యుడు ఉండేవాడు. ఇతను 'చరక సంహిత' అనే వైద్య గ్రంథం రాశాడు. కనిష్కుని కాలంలో బౌద్ధమతం హీనయానం, మహాయానం అని రెండు వర్గాలుగా చీలిపోయింది. చివరి రాజు వాసుదేవుడు.

ప్రాధాన్యం

వీరి కాలంలో సంస్కృతం, సాహిత్యం అభివృద్ధి చెందడం ప్రారంభమైంది. నాలుగో బౌద్ధమత సమావేశం సంస్కృతంలో జరిగింది. అశ్వఘోషుడిని తొలి సంస్కృత నాటక కర్తగా పరిగణిస్తారు. వీరి కాలంలో మూడు విభిన్న శిల్పకళ పాఠశాలలు అభివృద్ధి చెందాయి. అవి...

శిల్పకళ

గాంధార శిల్పకళ: దీనిని కనిష్కుడు ప్రారంభించాడు. గాంధార ప్రాంతం విదేశీయుల ప్రభావానికి లోనైంది. ఈ శిల్పాల్లో బుద్ధుని ముఖంలో సాత్విక స్వభావంతో కాకుండా, పౌరుషత్వం కనిపిస్తుంది. కండలు తిరిగిన శరీరం, రింగులు తిరిగిన జుట్టుతో బుద్ధుని విగ్రహాలు...ఆత్మలేని శరీరాల్లా ఉన్నాయి. అందువల్ల భారతీయ శైలిపై గాంధార శిల్పం ప్రభావం చూపలేదు.

క్రీ.శ. 5వ శతాబ్దంలో హూణుల దండయాత్రలో గాంధార శిల్పాలు కొంత వరకు ధ్వంసం అయ్యాయి. గ్రీకు-రోమన్ శిల్పకళ ప్రేరణతో ఇండో-గ్రీకు లక్షణాలతో ఏర్పడిందే గాంధార శిల్పకళ. బూడిదరంగు రాతితో చెక్కేవారు. దక్షిణాసియాలోని 'హెలెనిస్టిక్' కళతో దీనిని రూపొందించారు. తొలి విగ్రహం బిటర్‌గాం వద్ద లభించింది. ఎక్కువ విగ్రహాలు కాందహార్ లేదా గాంధార్‌లో లభ్యమయ్యాయి. బమియాన్‌లో ఉన్న అతిపెద్ద విగ్రహాన్ని గొప్ప ఉదాహరణగా చెప్పవచ్చు.

మధుర శిల్పకళ: ఈ శిల్పకళ కూడా క్రీ.శ.100 ప్రాంతంలో కనిష్కుని కాలంలోనే పుట్టింది. మధుర శిల్పకళలో మత, మతేతర శిల్పాలు ఉన్నాయి. మధుర శిల్పకళలో బౌద్ధ, జైన, హిందూ మతాల శిల్పాలు, నాగ, నాగిని శిల్పాలు గాక, సాలభంజిక శిల్పాలు ఉన్నాయి. ఈ శిల్పాలను సిక్రీలోని తెల్లచుక్కలు గల ఎర్ర ఇసుకరాతిలో తయారు చేశారు. వీటిలో స్త్రీల శిల్పాలు ఎక్కువగా ఉన్నాయి. భారతీయ రీతిలో మొదటి సారిగా బుద్ధుని శిల్పాన్ని మధుర శిల్పి సృష్టించాడు.

భోదిసత్వుని విగ్రహం: తల వెనుక ప్రభావ మండలంతో, తల చుట్టూ ముడుల టోపీ, కుడి చేయి అభయ ముద్రలో, ఎడమ చేయిలో కమండలం ఉంది. సుల్తాన్ గంజ్‌లో రాగితో చేసిన బుద్ధుని శిల్పం బర్మింగ్‌హోంలో ఉంది. ఇది గుప్తుల కాలంలో మధుర శిల్పకళ నుంచి ప్రేరణ పొందినట్లు తెలుస్తోంది.

- వాయువ్య భారతదేశంలోని గాంధార శిల్పకళ
- ఆంధ్రలో అమరావతి శిల్పకళ
- గంగా ప్రాంతంలో ముధుర శిల్పకళ

సిల్క్‌రూట్: వీరి కాలంలోనే భారతదేశం, చైనా మధ్య వర్తక వాణిజ్యాలు అభివృద్ధి చెందాయి. భారత్, రోమన్ దేశాల మధ్య వాణిజ్యం అభివృద్ధి చెందింది. చైనాలో బౌద్ధమతం వ్యాప్తికి దారి తీసిన సిల్క్‌రూట్‌లోని పెద్ద భాగాలను కుషాణులు నియంత్రించారు. ఈ సమయంలోనే బౌద్ధమతం కొరియా, జపాన్‌లో వ్యాపించడం ప్రారంభమైంది.

నిర్మాణాలు: కుషాణుల ఆధ్వర్యంలో నూతన నగరాలు నిర్మించారు. పురుషపురం, కశ్మీర్ మొదలైనవి. చైత్యాలు, అందమైన శిల్పాలను నిర్మించారు.

- మొదట కుషాణులను విదేశీయులుగా భావించినప్పటికీ... వారి పద్ధతులు, పాలన సంస్కరణలు పూర్తిగా భారతీయీకరించబడ్డాయి.
- భారతీయ చరిత్రలో కుషాణుల కాలం గుప్తుల స్వర్ణయుగానికి నాంది అని చెప్పవచ్చు.

సామ్రాజ్య పతనం: కనిష్కుని తర్వాత అతని కుమారుడు వశిష్కుడు రాజ్యానికి వచ్చాడు. వశిష్క తరవాత హువిష్క, రెండో కనిష్క వరుసగా పాలించారు. రెండో కనిష్కుని తరవాత చివరి రాజు వాసుదేవుడు. ఇతని తర్వాత క్రీ.శ. 176లో కుషాణుల రాజ్యం అంతరించింది.



డాక్టర్ ఐ. నీలా,
అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట.

పురుగుల అన్నం.. బొద్దింకల చికెన్..!

- నూజివీడు ట్రిపుల్ ఐటీ మెస్‌లో అధ్వానం
- నాణ్యమైన భోజనం అందించడంలో ప్రభుత్వం విఫలం
- వసతి దీవెన అంటూ ప్రచార ఆర్భాటానికే ప్రాధాన్యం

నూజివీడు టౌన్, మార్చి 10: విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా వసతిదీవెన అమలు చేస్తున్నామని జగన్ సర్కారు డబ్బా కొట్టుకుంటోంది. కానీ.. క్షేత్రస్థాయిలో మాత్రం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో క్యాంపస్‌లోని ఓ మెస్‌లో అన్నంలో పురుగులు.. చికెన్ కర్రీలో బొద్దింకలు రావడమే దీనికి నిదర్శనం. ట్రిపుల్ ఐటీలోని కేఎంకే మెస్‌లో పీయూసీ ద్వితీయ, ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు సుమారు వెయ్యి మందికి భోజన వసతి కల్పిస్తున్నారు. ఆదివారం భోజన సమయంలో చికెన్ కర్రీలో బొద్దింక, అన్నంలో పురుగులు రావడంతో విద్యార్థులు భోజనం చేసేందుకు నిరాకరించారు. దీనిపై విద్యార్థులు ట్రిపుల్‌ఐటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు పదార్థాలను తొలగించి తిరిగి భోజనం ఏర్పాట్లు చేశారు. భోజనం నాణ్యతపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని కొద్దిసేపు విద్యార్థులు నిరసన తెలిపారు.

టెండర్లలో పోటీ.. నాణ్యతలో రాజీ..

ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యావిధానం అమలవుతున్న నూజివీడు ట్రిపుల్ ఐటీలో దాదాపు 6,600 మంది విద్యార్థులు రెసిడెన్షియల్ విధానంలో విద్యనభ్యసిస్తున్నారు. వీరికి అదనంగా శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి చెందిన మరో 1500 మంది విద్యార్థులకు పూర్తిస్థాయి క్యాంపస్ తయారు కాకపోవడంతో నూజివీడు క్యాంపస్‌లోనే వసతి పొందుతున్నారు. నూజివీడు క్యాంపస్‌లో వారికి ముగ్గురు కేటర్లు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ వారికి ఒక కేటర్ భోజన సౌకర్యాలు అందిస్తుండగా మొత్తం ఎనిమిది డైనింగ్ హాళ్ల ద్వారా మెస్‌లు నడుస్తున్నాయి. చాలీచాలని మొత్తాలకు కేటర్లు పోటీపడి మెస్‌టెండర్లు వేయడంతో భోజన నాణ్యత నేతిబీర చందంగా మారుతోంది. మరోవైపు వారికి విడుదల చేయాల్సిన మెస్‌చార్జీలు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో భోజన నాణ్యతపై చర్యలు తీసుకునేందుకు సైతం ఆర్జీయూకేటీ సిబ్బంది వెనుకాడుతున్నారనే ఆరోపణలున్నాయి. గతేడాది కూడా నూజివీడు ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులు భోజన నాణ్యతపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ నిరసన తెలిపారు. అనంతరం నూతన మెస్‌ల ఏర్పాటుకు టెండర్లు పిలిచారు.. కొత్తగా వచ్చిన వారు కూడా టెండర్లు దక్కించుకునేందుకు పోటీపడి రోజుకు ఒక విద్యార్థికి రూ.89లకు కోట్ వేశారు. ఆ సొమ్ములోనే ప్రతిరోజూ పాలు, అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, పాలు, రాత్రి భోజన ఏర్పాట్లు చూడాలి. విద్యార్థులు ఆందోళన చేసిన సమయంలో తక్కువకు కోట్ చేయడం వల్ల ఇబ్బంది పడుతున్నామని కేటర్లు చెబుతున్నారు. అనంతరం గత ధరలకు అదనంగా రూ.5 పెంచుతూ మెస్‌టెండర్లు నిర్ణయించినప్పటికీ విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యత అంతంతమాత్రంగానే ఉంది.



విద్యార్థులకు అందించిన చికెన్ కర్రీలో బొద్దింక; అన్నంలో కనిపిస్తున్న పురుగు

ఉద్యోగాల్లో 40 కోట్లు ఊదేశారు!

- 'నా ఎస్సీ.. ఎస్టీ.. బీసీ..'లకే జగన్ వెన్నుపోటు
- అంగన్వాడీ సూపర్‌వైజర్ పోస్టుల్లో చేతివాటం
- నియామకాల్లో బడుగుల రిజర్వేషన్లకు పాతర
- అందినకాడికి దోచేసిన అధికారులు, నేతలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ సర్కారు ఉద్యోగాలిచ్చిన సంగతేమోగాని ఆ పేరు చెప్పి ఆ పార్టీ నేతలు నొక్కేసిందే ఎక్కువగా ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంగన్వాడీ సూపర్‌వైజర్ల నియామకాల్లో సుమారు రూ.40 కోట్లు చేతులు మారాయని రాష్ట్ర వ్యాప్తంగా గగ్గోలు మొదలైంది. 'నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ...' అంటూ ఊదరగొట్టే జగన్, ఈ పోస్టుల్లో ఆ వర్గాలకు అందాల్సిన రిజర్వేషన్ ఫలాలు పూర్తిగా అందకుండా చేశారు. దీనివల్ల ఒక్క ఒంగోలు జోన్‌లోనే సుమారు 25మందికి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగుల అభ్యర్థులకు అన్యాయం జరిగిందని చెబుతున్నారు. గోదావరి జిల్లాకు చెందిన ఓ ఉద్యోగ సంఘం నేత చక్రం తిప్పి ఈ అడ్డగోలు వ్యవహారం నడిపారని ఆరోపణలు వస్తున్నాయి. సుమారు 2 వేల మంది నుంచి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలు చొప్పున వసూలు చేశారని తెలుస్తోంది. ఈ కుంభకోణం జరిగి రెండేళ్లవుతున్నా... ఫిర్యాదు చేసేందుకు ఇప్పటికీ అంగన్వాడీ కార్యకర్తలు భయపడుతున్నారు. ఉన్నతాధికారులకు టార్గెట్ అవుతామని భయపడి అప్పట్లో ఫిర్యాదు చేయలేదు. అయితే, వైసీపీ పాలన దాదాపు ముగింపునకు వచ్చిన నేపథ్యంలో ధైర్యం చేసి కొంత మంది అభ్యర్థులు న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు. నియామకాల సమయంలో ఈ అడ్డగోలు వ్యవహారానికి అడ్డుపడుతున్నారన్న ఆగ్రహంతో అప్పట్లో మహిళా శిశు సంక్షేమశాఖ ఉన్నతాధికారినే బదిలీ చేశారు.

అసలేం జరిగిందంటే..

మహిళా శిశు సంక్షేమశాఖ 2022 సెప్టెంబరు 5న 560 ఎక్స్‌టెన్షన్ ఆఫీసరు గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టుల నియామకం కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ నెల 18న రాతపరీక్ష నిర్వహించారు. సుమారు 20 వేల మంది పరీక్షకు హాజరయ్యారు. పదేళ్ల సర్వీసు నిండిన అంగన్వాడీ కార్యకర్తలు, కాంట్రాక్టు విధానంలో అప్పటికే పనిచేస్తున్న సూపర్‌వైజర్లు పరీక్ష రాసేందుకు అర్హులు. జోన్ల వారీగా వైజాగ్ జోన్ కింద 76 పోస్టులు, ఏలూరు 126, ఒంగోలు 142, కర్నూలు 216 పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించారు. వివాదంలో ఉండటంతో నియామకం అయిన తర్వాత కోర్టు ఆదేశాలతో 164 పోస్టులు నిలిచిపోగా మిగిలిన 396 పోస్టులను నింపారు. రాతపరీక్ష 45 మార్కులకు ఆబ్జెక్టివ్ ప్రశ్నాపత్రం, మరో 5 మార్కులు కోసం ఇంగ్లీషు ఎఫిషియెన్సీ టెస్ట్ నిర్వహించారు. మహిళా సంక్షేమశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కన్వీనర్‌గా, ప్రాంతీయ కార్యాలయం ఉండే జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా కమిటీ వేసి మెరిట్ ఆధారంగా ఈ పోస్టులను భర్తీ చేశారు. ఇంగ్లీషు ఎఫిషియెన్సీ పరీక్షల తీరుపై విమర్శలు వచ్చాయి. నోటిఫికేషన్ ప్రకారం... ఇంగ్లీషులో నైపుణ్యం కలిగినవారి పర్యవేక్షణలో ఈ పరీక్ష నిర్వహించాలి. కానీ, అడ్డగోలుగా ప్రక్రియను పూర్తిచేశారు. ఇంగ్లీషు సంభాషణను (స్పీకింగు) వీడియో తీసి పంపాలని అభ్యర్థులకు చెప్పారు. అలా వచ్చిన వీడియోలను పరిశీలించి మార్కులు వేసి ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ టెస్ట్‌లో అధిక మార్కులు వచ్చిన వాళ్లకే ఉద్యోగం వస్తుందని రూల్ పెట్టారు. ఆ మార్కులు ఇచ్చేది తామేనంటూ అమ్యామ్యాలకు తెగబడ్డారు. గోదావరి జిల్లాలకు చెందిన ఓ ఉద్యోగ సంఘం నేత డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయి. కొన్ని చోట్ల వైసీపీ స్థానిక నేతలు, ఎమ్మెల్యేలు, కొన్ని చోట్ల మంత్రులు సైతం డబ్బులు తీసుకుని ఈ పోస్టులకు సిఫారసులు చేసినట్లు సమాచారం.

రిజర్వేషన్ అమల్లో అన్యాయం..

అధికారులు పోస్టుల నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేయడంలో తప్పులు చేశారు. మెరిట్ పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు సైతం రిజర్వేషన్ల కేటగిరీనే వర్తింపజేశారు. ఉదాహరణకు రాత పరీక్ష, ఇంగ్లిషు ఎఫిషియెన్సీ టెస్టు కలిపి మొత్తం 50 మార్కులకు పరీక్ష జరిగితే చెన్ను అనూరాధ 44.75 మార్కులు, యడ్లపల్లి ఉమాదేవి 44.50 మార్కులు తెచ్చుకున్నారు. అయినా, వారిని ఈడబ్ల్యూఎస్ కేటగిరీ కిందే పరిగణించారు. అదే విధంగా 44.75 మార్కులు పొందిన పందుల సలోమి, 44.50 మార్కులు పొందిన కాటూరి ప్రసన్నకుమారి ఎస్సీ కేటగిరిలో ఉన్నారు. వారిని మెరిట్ ఆధారంగా ఎంపిక చేయకుండా రిజర్వేషన్ల కేటగిరీ కింద భర్తీ చేశారు. రిజర్వేషన్ ప్రక్రియను కచ్చితంగా అమలు చేసి ఉంటే మరికొన్ని పోస్టులు ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు దక్కేవ అంటున్నారు. మరోవైపు, ఓపెన్ కేటగిరీలో మంచి మెరిట్ సాధించిన అభ్యర్థులకు కూడా చాలాచోట్ల అన్యాయం జరిగినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మెరిట్ అభ్యర్థులకు ముందువరుసలో ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా, ఉద్యోగ సంఘం నేతకు డబ్బులు కట్టినవారికీ, స్థానిక వైసీపీ నేతలతో చెప్పించుకున్నవారికీ పెద్ద పీట వేసినట్టు కొందరు బాధిత అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. వారంతా న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నారు.



మాతృభాషను కాపాడుకోవాలి

- ఎంతకీర్తి గడించినా మూలాలు మరవొద్దు
- యువతకు సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ సూచన
- 'ఎన్టీఆర్‌కు భారతరత్న' ఉద్యమానికి మద్దతు ప్రకటన

ఖమ్మం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎంత ఉన్నతస్థానానికి వెళ్లినా, ఎంత కీర్తి గడించినా మూలాలు మరచిపోకూడదని సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. యువత సామాజిక స్పృహ కలిగి ఉండాలని, మాతృభాష, సంస్కృతిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన అభిమానులు ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి భార్య శివమాలతో కలిసి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సమాజాభివృద్ధి జరగకపోతే ధనికులకు, పేదలకు మధ్య వ్యత్యాసాలు పెరిగి ఆకలి, అశాంతి పెరుగుతాయన్నారు. ఖమ్మం జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు ప్రజల కీర్తి పతాకాన్ని ఎర్రకోటపై ఎగురవేసిన వ్యక్తి జస్టిస్ ఎన్వీ రమణ అని కొనియాడారు. టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ విలువలతో కూడిన న్యాయవ్యవస్థ నిర్వీర్యం కాకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడిన వ్యక్తిజస్టిస్ ఎన్వీ రమణ అని పేర్కొన్నారు. అలాగే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎంపీ నామా నాగేశ్వరరావు ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయినా తమ సందేశాలను పంపారు. ఖమ్మం కమ్మ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్నెని రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్వీ రమణ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ తాతామధు తదితరులు పాల్గొన్నారు.



సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ దంపతులను సన్మానిస్తున్న టీ మంత్రి తుమ్మల

'ఎన్టీఆర్‌కు భారతరత్న' సంతకాల సేకరణకు సంఘీభావం

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనే డిమాండ్‌తో ఆయన అభిమానులు చేపట్టిన రాష్ట్రపతికి పోస్టు కార్డు కార్యక్రమానికి సుప్రీం కోర్టు పూర్వ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ సంఘీభావం తెలిపారు. పోస్టు కార్డుపై జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు సంతకాలు చేసి దానిని రాష్ట్రపతికి పోస్ట్ చేశారు.



దహనం అవుతున్న తుఫాన్ వాహనం, ద్విచక్ర వాహనం

పోలీసు స్టేషన్‌లో అగ్నిప్రమాదం

● దహనమైన వాహనాలు.. ● పోలీసుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం ?

నరసరావుపేట, మార్చి 10: నరసరావుపేట రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు దహనమయ్యాయి. ఒక జీపు, ద్విచక్రవాహనం అగ్నికి ఆహుత య్యాయి. పోలీసుల నిర్లక్ష్యం వలనే ఈ ప్రమాదం జరిగిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మునిసిపల్ రైతుబజారు స్థలాన్ని పోలీసుస్టేషన్ ఆవరణగా వినియోగించుకుంటున్నారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వహనాలను ఇక్కడ ఉంచారు. స్టేషన్ పక్కన ఉన్న చెత్తకు నిప్పు అంటుకుంది. దీనిని పోలీసులు గమనించకపోవడంతో మంటలు వాహనాలకు అంటుకున్నాయి. రెండు వాహనాలు పూర్తిగా దహనమయ్యాయి. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా ప్రాంతానికి వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలోనే ఇంకా అనేక వాహనాలు ఉన్నాయి. సకాలంలో మంటలు ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది.

మట్టి పాలవుతున్న వాహనాలు .. రూరల్‌స్టేషన్ ఆవరణలో వివిధ కేసుల్లో సీజ్‌చేసిన వాహనాలు పదుల సంఖ్యలోనే ఉన్నాయి. ఎన్నోనెలలు ఆరు బయట పడేయడంతో అవి మట్టి పాలవుతున్నాయి. సీజ్ చేసిన వహనాలకు రక్షణ కల్పించాల్సిన పోలీసుశాఖ వాటివిషయంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పోలీసులకు పట్టుబడితే వాహనంపై ఆశలువదుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అగ్నిప్రమాదంలో దహనమైన వాహనాలకు సంబంధించిన యజమానులకు పోలీసుశాఖ పరిహారం చెలించాల్సి ఉంటుందంటున్నారు. ప్రమాదంలో రూ.6 లక్షల మేర నష్టం వాటిల్లి ఉంటుందని అంచానా.




గుంటూరు రైల్వేస్టేషన్‌లో రైలు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణీకులు

గుంటూరు రైల్వేస్టేషన్ రైళ్లలో రద్దీ

గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు వైసీపీ సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులన్ని వెళ్లిపోవడం... మరోవైపు గుడారాల పండగకు వచ్చిన యాత్రీకులు తిరుగుముఖం పట్టడంతో ఆదివారం రైళ్లు రద్దీగా మారాయి. దీనికి తోడు రెగ్యు లర్‌గా ప్రయాణించే 12రైళ్లను రైల్వేశాఖ ఇన్‌ఫ్రాస్ట్రక్చరల్ మెయిన్‌టెనెన్స్ పనుల పేరుతో రద్దు చేయడం కూడా రద్దీగా కారణంగా మారింది. ఆదివారం సాయంత్రం విజయవాడ- లింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ విజయవాడలోనే ఫుల్ అయిపోయి గుంటూరు రైల్వేస్టేషన్‌కు చేరుకోగా అందులో ఎలాగోలా కాలుపెట్టి హైదరాబాద్ వెళ్లేందుకు వందలసంఖ్యలో ప్రయాణీకులు ఎక్కారు. దీంతో రిజర్వుడ్ బోగీలు జనరల్ బోగీలను తలపించాయి. అడుగు తీసి అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. నరసరావుపేట మార్గంలో ప్రయాణించే తిరుపతి, కాచీగూడ, హుబ్లీ, బెంగళూరు రైళ్లలోనూ రద్దీ తలెత్తింది.

పసిడి పంటగా పసుపు!



● క్వింటాల్ రూ.15 వేలకు చేరువగా ధర
● పదమూడేళ్ల తర్వాత రూ.13 వేలు దాటిన వైనం
● రూ.17 వేలు పెరగవచ్చని నిపుణుల అంచనా..
● విక్రయానికి త్వరపడుతున్న సాగుదారులు

దుగ్గిరాల, మార్చి 10: పసుపు క్వింటాల్ ధర రూ.15 వేలకు చేరువవుతుండటంతో అన్నదాత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వారంలో అత్యధికంగా క్వింటాల్ ధర రూ.13,900 వరకూ పలికింది. 2010లో రికార్డుస్థాయిలో క్వింటాల్ రూ.16 వేలు పలికింది. నానాటికి తగ్గుతూ గతేడాది వరకూ క్వింటాల్ రూ.4,500 వేలకు మించి ధర పలకలేదు. ప్రస్థుతం బయటి మార్కెట్‌లో ఇప్పటికే క్వింటాల్‌కు



దుగ్గిరాల యార్డులో అమ్మకానికి సిద్ధం చేసిన పసుపు రాసులు

రూ.14,500 వరకూ పలుకుతోంది. దీంతో సంప్రదాయ పంటగా సెంటిమెంట్‌గా పసుపు సాగును కొనసాగించిన రైతులు పెరిగిన ధరతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక పసుపు మార్కెట్ యార్డులో గతేడాది వరకూ 1000 బస్తాల పసుపు విక్రయాలు మొత్తం మీద నెల రోజులు కూడా జరగలేదంటే అతిశయోక్తిలేదు. కాగా గతేడాది డిసెంబర్ నుంచి ధర పెరుగుతుండటంతో విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ధర పెరుగుదల ఇదేవిధంగా కొనసాగితే క్వింటాల్ రూ.17 వేల వరకూ చేరుకోవచ్చునని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పుడిప్పుడే పసుపు రైతులు పంటను తవ్వడం ప్రారంభిస్తున్నారు. మార్కెట్‌కు కొత్త పసుపువస్తే ధరలు తగ్గుతాయేమోనన్న భయంతో త్వరితగతిన తమ పంటను యార్డుకు తీసుకువచ్చి విక్రయించేందుకు రైతులు పూనుకుంటున్నారు. ప్రస్తుతం దుగ్గిరాల మార్కెట్‌యార్డు పరిధిలో యార్డు, సెంట్రల్ వేర్‌హౌస్, ఇతర కోల్డ్ స్టోరేజిలలో కలిపి దాదాపు లక్ష బస్తాల వరకూ పసుపు నిల్వలున్నాయని చెబుతున్నారు. కొత్త పసుపు యార్డుకు వచ్చిన ప్పటికీ ప్రస్తుతం మార్కెట్ డిమాండ్‌కు సరిపడా సరుకువచ్చే అవకాశంలేదని చెబుతున్నారు. ఈనేపథ్యంలో ధర మరింత పెరగ వచ్చునని రైతులు ఆశాభావంతో ఉన్నారు.

దేశవ్యాప్తంగా వివిధమార్కెట్లలో పసుపు ధరలు ..

మహారాష్ట్రలోని శాంగ్లిలో పసుపు క్వింటాల్‌ధర రూ.17,600, తమిళనాడు ఈరోడ్‌లో క్వింటాల్ రూ.17,400, కడపలో క్వింటాల్ ధర రూ.14,100, నిజామాబాద్ మార్కెట్ క్వింటాల్ రూ.15,325 వరకూ పలుకుతున్నాయి.

ఎమ్మెల్యే బొల్లా .. తంగిరాల డ్యామ్ ఎక్కడ ?

● గత ఎన్నికల్లో గెలిచేందుకు అడ్డగోలు హామీలు
● మోసం చేసిన బ్రహ్మనాయుడుని ప్రజలు నిలదీయండి
● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు
● గుండ్లకమ్మ నదిపై డ్యామ్ వెతుకుతూ వినూత్న నిరసన

నూజెండ్ల, మార్చి 10 : 'గుండ్లకమ్మ నదిపై తంగిరాల వద్ద డ్యామ్ కట్టడమే నా ఆశయమని గత ఎన్నికల సందర్భంలో ప్రజలకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే బొల్లా.. తంగిరాల డ్యామ్ ఎక్కడ?' అంటూ టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రశ్నించారు. అడ్డగోలు హామీలతో మోసం చేసిన ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుని గ్రామాల్లోకి రానీయకుండా పొలమేరల వద్దే నిలవేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఆదివారం మండలంలోని తంగిరాల సమీపంలో గుండ్లకమ్మ నది పై ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నిర్మిస్తానన్న 'డ్యామ్‌ను వెతుకుదాం' అనే వినూత్న నిరసన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు టీడీపీ, జనసేన నాయకులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మోస పూరిత హామీలిచ్చి నెరవేర్చని ఎమ్మెల్యే బొల్లా నిజ స్వభావాన్ని ప్రజలకు తెలియజేసేందుకే ఈనిరసన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రైతులకు, వినుకొండ ప్రజలకు ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు చేసిన అన్యాయాలు, అక్రమాలపై ధ్వజమెత్తారు. గత ప్రభుత్వపాలనలో రూ.640కోట్లు వాటర్‌గ్రిడ్ నిధులు మంజూరు కాగా కాంట్రాక్టర్ల నుంచి 25 శాతం కమిషన్‌ను బ్రహ్మనాయుడు



డ్యామ్ ఎక్కడా అని వెతుకుతున్న జీవీ ఆంజనేయులు, టీడీపీ, వైసీపీ నేతలు

డిమాండ్ చేయటంతో వారు పారిపోయారన్నారు. మీ ఎన్నికల హామీలపైన వంద పరిశ్రమలు, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఇంజనీరింగ్ కళాశాలలు వినుకొండ ప్రాంతంలో ఎక్కడ ఉన్నాయన్నాయని ప్రశ్నించారు. కంభంపాడు, ఉప్పలపాడు, ములకలూరు గ్రామాల్లోని భూములకు సాగునీరు అందించేందుకు ఐదు లిఫ్ట్ ఇరిగేషన్‌లు మంజూరైనా ఎందుకు నిర్మించలేదని నిలదీశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యంగా అన్ని గ్రామాలకు రక్షిత తాగునీరు అందిస్తామన్నారు. గోదావరి-పెన్నా నదుల అనుసంధానం ద్వారా, వరికపుడిసెల ప్రాజెక్టు నిర్మాణంతో వినుకొండ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. పేదలకు, రైతులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ముంద్రు సుబ్బారావు, ఎం మురళీకృష్ణయాదవ్, వీ.పేరయ్య, సోమేపల్లి బ్రహ్మయ్య, గంగినేని చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రావుల మల్లేశ్వరరావు, మేదరమెట్ల అనీల్ కుమార్, నిడమానూరి శ్రీను, చింతా ఆదిరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడండి



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

● రానున్న ఎన్నికల్లో వైసీపీ నేతలను ఇంటికి సాగనంపండి
● టీడీపీ, జనసేన బాపట్ల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన

బాపట్ల, మార్చి10 : వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు, రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఆ పార్టీ నేతలను చిత్తుగా ఓడించి ఇంటికి సాగనంపాలని టీడీపీ, జనసేన బాపట్ల నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ పిలుపునిచ్చారు. బాపట్ల నియోజకవర్గం నుంచి హైదర్‌బాద్ వెళ్ళి అక్కడ నివాసం ఉంటున్న బాపట్ల నియోజకవర్గ వాసులతో ఆదివారం నరేంద్రవర్మ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. హైదరాబాద్, మియాపూర్ ప్రాంతంలో నిర్వహించిన ఈసమావేశంలో టీడీపీ, జనసేన నేతలతో పాటు ఆయా ప్రాంతాలలో ఉంటున్న 1500 మంది బాపట్లవాసులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి సమావేశాన్ని ప్రారంభించిన నరేంద్రవర్మ మాట్లాడుతూ.. బాపట్ల భవిష్యత్తు కోసం టీడీపీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. రాబోయే 5 సంవత్సరాలు ఒక మంచి వ్యక్తికి ఓటువేశాం అనేలాచేస్తానని, అవినీతిలేని పాలనతో ప్రజలకు సుపరిపాలన అందిస్తానని వేగేశన హామీనిచ్చారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉంటున్న బాపట్ల నియోజకవర్గ వాసులంతా ఎన్నికల సమయంలో బాపట్లకు వచ్చి తనకు ఓటువేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, రాష్ట్ర తెలుగు ప్రొపెషనల్ వింగ్ అధ్యక్షుడు పొడపాటి తేజస్విని, వేగేశన రాధాకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

జనసైనికులపై వైసీపీ మూక దాడి

● మహాశివరాత్రి తిరునాళ్ళలో ప్రభల అడ్డగింత
● ఆపై కర్రలతో దాడి .. ఆరుగురికి తీవ్ర గాయాలు
● ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులు

చెరుకుపల్లి, అమృతలూరు, మార్చి 10: రాష్ట్రంలో జనసేన, టీడీపీ కూటమిని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు దాడులకు ప్రేరేపిస్తున్నారనటానికి ఇది ఒక నిదర్శనం. మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని పొదిలివారం గ్రామానికి చెందిన జనసైనికులు గోవాడ తిరునాళ్ళకు ప్రభలతో వెళ్ళగా ప్రభను శ్రీబాల కోటేశ్వరస్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న సమయంలో వైసీపీకి చెందిన వారు వారి ప్రభలతో జనసేన ట్రాక్టర్‌లకు అడ్డు తగిలారు. ఆ క్రమంలో జన సైనికులు వైసీపీ శ్రేణులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వారు వినిపించుకోలేదు. పరుష పదజాలంతో మాట్లాడుతూ, కర్రలతో జనసైనికులపై దాడిచేశారు. వైసీపీ మూకల దాడిలో జనసేనపార్టీకి చెందిన వారికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసు పికెట్‌కు కూతవేటు దూరంలో ఘర్షణ జరుగుతున్నా పోలీసులు చూస్తుండి పోయారని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ



వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన జనసైనికులు

దాడిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. అనంతరం తమపై దాడిచేసిన వారిని గుర్తించేందుకు బాధితులు దాడికి పాల్పడిన వారి గ్రామాలకువెళ్ళగా 'మాపై ఫిర్యాదుచేసి మమ్మలను గుర్తించేందుకు మా గ్రామానికే వస్తారా' అంటూ వైసీపీ కార్యకర్తలు అసభ్య పదజాలంతో దూషిస్తూ గ్రామానికి వచ్చిన జనసైనికులపై కర్రలతో దాడి చేసి కొట్టారు. ఈఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని బాధితులను చికిత్స నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జరిగిన రెండు ఘటనలపై ఇరు పార్టీలవారి ఫిర్యాదలను స్వీకరించి విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

బాలుడికి మద్యం తాగించిన బెల్టుషాపు నిర్వాహకులు

నరసరావుపేటరూరల్, మార్చి 10: మండలంలోని అచ్చెమ్మపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు రెండేళ్ళ బాలుడికి, వారి ఇంటి ప్రక్కన బెల్టుషాపు నిర్వహకులు మద్యం తాపాడు. రెండు రోజులుగా బాలుడు మత్తులో ఉండటాన్ని గుర్తించి ఆస్పత్రికి తరలించామని బాలుడి తల్లిదండ్రులు తెలిపారు. ఈ ఘటనపై నరసరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని బాదితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇంటి పక్కనే మద్యం బెల్టుషాపు గంజాయి విచ్చవిడిగా అమ్ముతున్నారని పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇంటిపక్కనే మద్యం విక్రయిస్తుండటంతో తమకు ఇబ్బంది ఉందన్నారు. తన రెండేళ్ళ కుమారుడికి మద్యం తాగించిన వారిపై చర్యలు చేపట్టాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై నరసరావుపేటరూరల్ ఎస్‌ఐ రోశయ్యను వివరణకోరగా అచ్చెమ్మపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావుకు, అదే గ్రామానికి చెందిన కుంచాల రత్నకుమారికి ఆర్థిక లావాదేవిల విషయంలో కొంత కాలంగా వివాదం నడుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు కుమారుడికి మద్యం తాగించారని ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ పిర్యాదుపై గ్రామంలో విచారించగా చిన్నారికి మద్యం తాగించలేదని విచారణలో తేలిందన్నారు.

సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ఔరంగబాద్ వరకు పొడిగింపు

● రేపల్లె - సికింద్రాబాద్ డెల్టా ఎక్స్‌ప్రెస్ వికారబాద్ వరకు ..
● ఉత్తర్వులు జారీ చేసిన రైల్వే శాఖ

గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఉదయం గుంటూరు నుంచి బయలుదేరి నరసరావుపేట మార్గంలో ప్రయాణించి రాత్రికి సికింద్రాబాద్ చేరుకొనే ఎక్స్‌ప్రెస్‌ని ఔరంగబాద్ వరకు పొడిగిస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు వెలువరించింది. నెంబరు. 17253 గుంటూరు - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ జూన్ 30వ తేదీ నుంచి గుంటూరు - ఔరంగబాద్ ఎక్స్‌ప్రెస్‌గా మారుతుంది. ఈ రైలు ఆ తేదీ నుంచి ఉదయం 7.10కి బయలుదేరి రాత్రి 10 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకొంటుంది. అనంతరం 10.10కి బయలుదేరి బేగంపేట, సనత్‌నగర్, హఫీజ్‌పేట, లింగంపల్లి, బీదర్ మీదగా మరుసటి రోజు మధ్యాహ్నం 1.20కి ఔరంగబాద్ చేరుకొంటుంది. నెంబరు. 17254 ఔరంగబాద్ - గుంటూరు రైలు జూలై 1వ తేదీ నుంచి నిత్యం సాయంత్రం 4.15కి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 9.30కి గుంటూరు చేరుకొంటుంది. దీని వలన నరసరావుపేట, వినుకొండ పరిసర ప్రాంతాల ప్రయాణీకులకు ఔరంగబాద్ రైల్ కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుంది. అక్కడికి సమీపంలోనే గృష్ణేశ్వర్ జ్యోతిర్లింగం ఉండటంతో శివభక్తులకు ఉపయోగకరంగా ఉంటుంది. అలానే షిర్డికి అక్కడి నుంచి చేరుకోవచ్చు. కాగా నెంబరు. 17626 రేపల్లె - సికింద్రాబాద్ డెల్టా ఎక్స్‌ప్రెస్‌ని వికారబాద్ వరకు పొడిగించారు. ఈనెల 13వతేదీ నుంచే ఈ రైలు రాత్రి 10.40కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.15కి సికింద్రాబాద్‌కు చేరుకొని 7.30కి బయలుదేరి 9.40కి వికారబాద్ చేరుకొంటుంది. దీనివలన లింగంపల్లి పరిసర ప్రాంతాల్లో నివసించే ఇక్కడి ప్రయాణీకులకు ఉపయోగకరంగా ఉంటుంది.

ప్రస్తుతం కాకినాడపోర్టు- చెంగలపట్టు మధ్యన న్యూగుంటూరు మీదగా రాకపోకలు సాగిస్తున్న సర్కారు ఎక్స్‌ప్రెస్ వారంలో మూడు రోజుల పాటు పుదుచ్చేరి వరకు పొడిగించారు. నెంబరు. 17644 కాకినాడపోర్టు - పుదుచ్చేరిగా మారనున్న సర్కారు ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 13వ తేదీ నుంచి ప్రతీ ఆది, బుధ, గురువారంలలో పుదుచ్చేరి వరకు ప్రయాణిస్తుంది. 15వ తేదీ నుంచి సోమ, మంగళ, శుక్ర, శనివారంలలో మాత్రం చెంగలపట్టు వరకే ప్రయాణిస్తుంది. నెంబరు 17643 చెంగలపట్టు - కాకినాడ పోర్టు రైలు ఈ నెల 16 నుంచి మంగళ, బుధ, శని, ఆదివారంలలో సాదారణంగా ప్రయాణిస్తుంది. 14వ తేదీ నుంచి ప్రతీ సోమ, గురు, శుక్రవారంలలో పుదుచ్చేరి నుంచి కాకినాడ పోర్టుకు బయలుదేరుతుంది. ఈ మార్పులను ప్రయాణీకులు గమనించాలని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ తెలిపారు.

మహిళ దారుణ హత్య

● నిందితుడితో వివాహేతర సంబంధం.. సహజీవనం
● మనస్పర్థల నేపథ్యంతో కత్తితో పొడిచి దారుణంగా హత్య..

గుంటూరు(కార్పొరేషన్), మార్చి 10: గుంటూరు నగరం, కాకాని రోడ్డులోని షాప్ ఎంప్లాయిస్ కాలనీలో ఆదివారం ఓ మహిళ దారుణహత్యకు గురైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమండ్రి సమీపంలోని దేవరపల్లి గ్రామానికి చెందిన కొమవరపు మరియమ్మ అలియాస్ ఆశ (30) అనే మహిళకు వివాహం జరిగింది. ఆమెకు ముగ్గురు సంతానం ఉన్నారు. ఆరునెలల క్రితం ఆశ రాజమండ్రి నుంచి గుంటూరు వచ్చి నివాసం ఉంటుంది. ఈ క్రమంలో ఆశాకి రాపాక దుర్గారావు అనే వ్యక్తితో పరిచయమైంది. ఆ పరిచయం వారి మధ్య వివాహేతర సంబంధానికి దారి తీసింది. దీంతో దుర్గారావుతో సహజీవనం చేస్తూ వస్తుంది. వారి మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో ఇటీవల కొంత కాలం నుంచి ఘర్షణ పడుతూ వస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఆశ దుర్గారావుతో దురుసుగా వ్యవహరించడంతో అతను కోపోద్రిక్తుడయ్యాడు. దీంతో ఆదివారం తెల్లవారుజామున ఆశ ఉంటున్న షాప్ ఎంప్లాయిస్ కాలనీకి వెళ్లి ఆమెతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆశను దారుణంగా పొడిచి హత్యచేశాడు. సమాచారం అందుకున్న పాత గుంటూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆశ మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. హత్యకు పాల్పడింది ఆమెతో సహజీవనం చేస్తున్న దుర్గారావుగా గుర్తించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పాత గుంటూరు సీఐ రమేష్ బాబు తెలిపారు.



వైసీపీ శ్రేణులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రాష్ట్రాభివృద్ధి టీడీపీ, జనసేనలతోనే సాధ్యం

● రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మార్చి 10: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలంటే టీడీపీ, జనసేనలతోనే సాధ్యమని రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఆదివారం రేపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రేపల్లె మండలం, నల్లూరుపాలెం గ్రామానికి చెందిన నిజాంపట్నం మండలం ప్రజ్ఞం గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు పలువురు టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే అనగాని వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనగాని మాట్లాడుతూ.. అధికార పార్టీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన అంతిమ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే విజయమన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమన్నారు. ప్రతి కార్యకర్త టీడీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పంతాని మురళీధరరావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి తాతా ఏడుకొండలు, నల్లపాటి యల్లయ్య, సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న కృష్ణ

మనస్మృతికి వ్యతిరేకంగా పోరాడుదాం

● అగ్రకులాధిపత్య, పితృస్వామ్య భావజాలాన్ని ఖండించండి
● సావిత్రీబాయిపూలే వర్ధంతి సభలో కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ

గుంటూరు, మార్చి10: అగ్రకులాధిపత్య, మనువాద, పితృస్వామ్య, భావజాలానికి వ్యతిరేకంగా పోరాడటమే సావిత్రిబాయి పూలేకిచ్చే ఘనమైన నివాళి అని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కే. కృష్ణ అన్నారు. రాష్ట్ర కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో గుంటూరు, సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆధునిక భారతదేశ తొలితరం మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా రాష్ట్రస్థాయి మహిళా చైతన్య సదస్సు నిర్వహించారు. కావలి జయమ్మ అధ్యక్షతన 'మహిళలు - మనస్మృతి' అంశంపై నిర్వహించిన ఈ సమావేశంలో మానవ వికాస వేదిక జాతీయ అధ్యక్షుడు బీ. సాంబశివరావు మాట్లాడుతూ మనస్మృతి ద్వారా పీడిత కులాల ప్రజలను ముఖ్యంగా మహిళలను చదువుకు, సంపదకు, ఆస్తికి, ఆయుధానికి, దూరంగా పెట్టిన బ్రాహ్మణవాద భావజాలానికి వ్యతిరేకంగా సావిత్రీబాయి పూలే నిలిచారన్నారు. నిత్యం అన్యాయానికి అణిచివేతకు దోపిడీ, దౌర్జన్యాలకు గురవుతున్న అంటరాని మహిళలకు విద్య అవసరమని గుర్తించి విద్య నేర్పిన మహా మనిషి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. రెండవ అంశంగా దుడ్డు కుసుమకుమారి అధ్యక్షతన 'సామాజిక ఉద్యమాలు - శ్రామిక మహిళల పాత్ర' అంశంపై విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నేత సీఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ జ్యోతిరావు, సావిత్రిబాయి పూలేల ప్రేరణతో శ్రామిక మహిళలు తమ హక్కుల కోసం ప్రాణాలకు తెగించి ముందుండి నాయకత్వం వహిస్తూ వీరోచితంగా పోరాడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకటరావు, కోశాధికారి కావలి బాలయ్య, కార్యవర్గ సభ్యులు, పీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రజాకళామండలి కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



తుళ్ళూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు , రైతులు

ఆంధ్రుల ఆకాంక్ష 'అమరావతి'

● 1545 వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, మార్చి 10: రాష్ట్రంలో ఎక్కడా చూసిన అభివృద్ది లేదు కాని పేద మధ్య తరగతి ప్రజలపై సీఎం జగన్‌రెడ్డి పన్నుల బాదుడు తప్పటం లేదని రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు మంగళవారం నాటికి 1545వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు ధర్నా శిబిరాల నుండి మాట్లాడుతూ.. సీఎం జగన్‌రెడ్డి హైకోర్టు తీర్పును పరిగణలోకి తీసుకొని మూడు రాజధానుల అంశానికి స్వస్తి పలకాలన్నారు. అభివృద్ధి చేయాలని ఉంటే ప్రత్యేక హోదా తీసుకురావాలన్నారు. సొంత ప్రయోజనాల కోసం మూడు రాజధానులంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సీఎం జగన్‌రెడ్డి రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. రాజధాని 29 గ్రామాలతో పాటు మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాలలో ఆందోళనలు కొనసాగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.33 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

తండ్రి విజయం కోసం తనయుడు

- ఇంటింటి ప్రచారంలో పాల్గొంటున్న నక్కా అఖిలేష్


పోతుమర్రు ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి ఆనందబాబు తనయుడు అఖిలేష్

వేమూరు, మార్చి 10: తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా వేమూరు నియోజకవర్గ నుంచి పోటీలో ఉన్న మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు తనయుడు అఖిలేష్ తన తండ్రి విజయం కోసం ఇంటింటి ప్రచారంలో పాల్గొంటున్నారు. ఆదివారం రాత్రి మండలంలోని పోతుమర్రు గ్రామంలో ఇంటింటా తిరిగి మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ మహిళల తో మమేకమై చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యేందుకు రాష్ట్ర ప్రజలు, రాష్ట్రం అభ్యున్నతి కోసంగా ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని పిలుపుని చ్చారు. నియోజకవర్గంలో మూడు పార్టీల బలపరిచిన తన తండ్రి ఆనందబాబు ను గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు.

డిజిటల్ ఎల్‌ఈడీ స్క్రీన్ వాహనం ప్రారంభం


వేమూరులో డిజిటల్ ఎల్‌ఈడీ స్క్రీన్ ఎన్నికల ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆనందబాబు

వేమూరు, మార్చి 10: ఎన్నికల ప్రచార నిమిత్తంగా ఆదివారం సాయంత్రం వేమూరులోని టీడీపీ కార్యాలయం వద్ద ఎన్నికల ప్రచార నిమిత్తంగా డిజిటల్ ఎల్‌ఈడీ స్క్రీన్ వాహనాన్ని మాజీ మంత్రి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు ప్రారంభించారు. దీనిపై ప్రదర్శించిన లఘు చిత్రాలను చూశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజావ్యతిరేక విధానాలను రాష్ట్ర దుస్థితిపై ప్రదర్శించిన ఘట్టాల చిత్రీకరణ ద్వారా ప్రజలు చైతన్య వంతులవుతారని ఆయన పేర్కొన్నారు. లఘు చిత్రాల్లో చంద్రబాబునాయుడు ప్రకటించిన మ్యానిఫెస్టో వివరాలు పార్టీ శ్రేణులు అవగతం చేసుకుని ప్రతి ఓటరుకు తెలియపరచాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్ మహిళా నాయకురాలు భాగ్యలక్ష్మీ, దొప్పలపూడి సుధాకర్, కోగంటి శ్రీనుబాబు, ఎలవర్తి సురేంద్ర, రాజేష్, గోపినాథ్, మన్నే పసి, నాగయ్య, అన్నే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శిగా రమేష్‌బాబు


నియామక పత్రం అందుకుంటున్న రమేష్‌బాబు

చుండూరు మార్చి 10: మండలంలోని పెనుకుదురుపాడుకు చెందిన వాగోలు రమేష్‌బాబును జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు నుంచి నియామకపత్రాన్ని అందుకున్నారు. రమేష్‌బాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించినందు కు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, విష్ణుమొలకల శ్రీనివాసరావు, యాసం జగదీష్, వెనివెళ్ళ ధర్మేంద్ర, దాసరి రమేష్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులకు న్యూట్రిషన్ ఫుడ్ అందజేత

రేపల్లె, మార్చి 10: పట్టణంలో హెచ్‌ఐవీ బాధితులకు ఆర్యవైశ్య మహిళా నాయకులు న్యూట్రిషన్ ఫుడ్‌ను ఆదివారం అందజేశారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో హెచ్‌ఐవీతో బాధపడుతున్న చిన్నారులకు చేయూతనిచ్చేందుకు ఆర్యవైశ్య మహిళా సంఘం ముం దుకు వచ్చింది. ఈ సందర్భంగా మహిళా నాయకురాలు పొన్నూరి గౌరీరామకుమారి మాట్లాడుతూ 27మంది వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్‌ను అందజేశామని వారికి కావాల్సిన బట్టలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు మెడతాటి విజ య, మద్ది పద్మజ, చుండూరి ఇందుమతి, ఊటుకూడి అనంతలక్ష్మి, నాగలీల, తడవర్తి రాధిక, ఎం విజయ తదితరులు పాల్గొన్నారు.

తారకరామయూత్ ఆధ్వర్యంలో షటిల్ టోర్నమెంట్

బాపట్ల, మార్చి 10 : మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని కంకటపాలెంలో తారకరామా యూత్ ఆధ్వర్యంలో షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. కమిటీ సభ్యులు యార్లగడ్డ శ్రీనివాసరావు, మల్లారపు రవీంద్ర, కొమ్మన బోయ న వెంకటసాయికృష్ణ, కీర్తిలక్ష్మణ్, గోనబోయన వంశీ పర్యవేక్షణలో ఆర్గనైజర్ మద్దిబోయన గోపికృష్ణయాదవ్ నిర్వహించిన ఈ పోటీలకు వివిధ ప్రాంతాలు నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. తెనాలి క్రీడాకారులు మొదటి బహుమతి సాధించగా బాపట్ల క్రీడాకారులు ద్వితీయ బహుమతి, కంకటపాలెం క్రీడాకారులు తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు ప్రథమ బహుమతి మిం డాల నరసింహారావు జ్ఞాపకార్థంగా మిండాల నాగరాజు రూ.10,016లు అందజేశారు. ద్వితీయ బహుమతి నల్లగొర్ల వెంకటషణ్ముఖ జ్ఞాపకార్థం శ్రీరా ములు రూ.5,016లు, తృతీయ బహుమతి గ్రామసర్పంచ్ మద్దిరాల వందనం రూ. 3016లు విజేతలకు అందజేశారు. కార్యక్రమాన్ని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రావిపూడి నాగమల్లేశ్వరరావు ప్రారంభించగా అతిథులు నక్కల వీరరాఘవయ్య, రావిపూడి వీరేంద్రనాధ్, చుక్కా పరమేశ్వరరావు, కాకా హేమంత్‌లు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

తిరునాళ్ల సందర్భంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పోలీసులు లేక అదుపుతప్పిన పరిస్థితి
- ఒకరికి కత్తిపోట్లు, ద్విచక్ర వాహనం దగ్ధం


దగ్ధమవుతున్న ద్విచక్ర వాహనం

కొల్లూరు, మార్చి 10 : అనంత భోగేశ్వర మల్లేశ్వర స్వామి దేవస్థానం వార్షిక తిరునాళ్లలో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. ద్విచక్ర వాహనాలతో రెండు సామాజికవర్గాలకు చెందిన యువకుడు హల్‌చల్ చేయటం తో ఘర్షణకు దారి తీసింది. ఓ వర్గానికి చెందిన యువకుడి ద్విచక్ర వాహనానిన ప్రధాన రహ దారిలో మరో వర్గం వారు తగులబెట్టారు. తమ సన్నిహితుడైన యువకుడిని ఎదుటివారు కత్తితో పొడవడం వల్ల అతడు గాయాలపాలయ్యాడని ద్విచక్ర వాహనాన్ని తగలబెడుతున్న వారు ఆరోపిస్తున్నారు. పోలీసులు సిద్ధం సభకు వెళ్లటంతో కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఇద్దరు, ముగ్గురు పోలీసులు పరిస్థితిని అదుపుచేయలేకపోయారు. ఈ ఘర్షణతో స్థానికులు తలుపులు బిగించుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. పోలీసు సిబ్బంది తెనాలి అగ్నిమాపక కేంద్రానికి ఫోను చేయడంతో అగ్నిమాపక శకటం హుటాహుటిన మంటలు ఆర్పేందుకు కొల్లూరు చేరుకుంది.

టీడీపీలోకి వందలాదిగా చేరికలు

- టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో వైసీపీలో కలవరం
- 150 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి ఆనందబాబు


టీడీపీలో చేరిన కార్యకర్తలతో మాజీ మంత్రి ఆనందబాబు

భట్టిప్రోలు, మార్చి 10: వైసీపీ నుంచి కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారు. మేము సైతం ఆనందన్న వెంట మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై నమ్మకంతో అంటూ ఆనందబాబు ఆధ్వర్యంలో పార్టీలో పని చేసేందుకు నిశ్చయించుకుని టీడీపీలో చేరుతున్నట్లు కార్యకర్తలు తెలియజేశారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 150 మంది కార్యకర్తలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కార్యకర్తలకు మాజీ మంత్రి నక్కా ఆనందబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సిద్ధం పేరిట వైసీపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న సభల్లో జనం లేనప్పటికీ గ్రీన్ మ్యాట్ ద్వారా వేలాదిగా జనం తరలివచ్చినట్లు చిత్రీకరించి ప్రచారం చేసుకుంటున్నారన్నారు. దేశంలో అత్యంత ధనవంతుల జాబితాలో సీఎం జగన్ రెడ్డి మొదటి స్థానంలో నిలుస్తారన్నారు. మద్యం వ్యాపారం ద్వారా వేలాది కోట్లు దండుకుంటూ ప్రజల జీవితాలతో, ఆరోగ్యాలతో చెలగాట మాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని రాష్ట్రంగా ఏపీని నిలిపారని, టీడీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు 72శాతం పూర్తయితే అలాంటి ప్రాజెక్టును సీఎం జగన్ నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. నియోజకవర్గంలో గడచిన 5 సంవత్సరాల్లో వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి ఎంత? టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని సిద్ధం సభలకు జనాన్ని తరలించేందుకు నియోజకవర్గానికి 400ఆర్టీసీ బస్సులను పంపించారని ఆయన తెలియజేశారు. భట్టిప్రోలు గ్రామంలో టీడీపీకి పెరుగుతున్న ఆదరణ ఆనందాన్ని కలిగిస్తుందని రానున్న ఎన్నికల్లో గ్రామంలో 3వేల మెజార్టీ తీసుకువచ్చే విధంగా జనసేన, టీడీపీ కార్యకర్తలు కలిసి పనిచేయాలని ఆనందబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, జనసేన నియోజకవర్గ కన్వీనర్ ఊసా రాజేష్, బీజేపీ బాపట్ల పార్లమెంట్ నాయకులు లియాఖత్ అలీ బేగ్, నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, కనపర్తి సుందరరావు, బట్టు మల్లికార్జునరావు, యడ్ల జయశీలరావు, ఇబ్రహీంబేగ్, ఆదిన బసవపున్నయ్య, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదపాలెం నుంచి 10 కుటుంబాలు చేరిక

భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రు పంచాయతీ పెదపాలెం గ్రామానికి చెందిన 10 కుటుంబాలు టీడీపీలో చేరారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సమక్షంలో ఆదివారం వైసీపీ నుంచి 10 కుటుంబాలు టీడీపీలో చేరగా కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన వెంకటేష్, మోహనరావు, సంసోను, లక్ష్మణరావు, రాహుల్, కుమార్, రవితేజ, రాజు తదితర కుటుంబాలు ఆనందబాబు ఆధ్వర్యంలో పని చేసేందుకు నిశ్చయించుకుని పార్టీలో చేరినట్లు తెలియజేశారు.

చంద్రబాబును సీఎంని చేద్దాం.. తలరాత మార్చుకుందాం

వేమూరు, మార్చి 10 : రాష్ట్ర ప్రజల కోసం వైసీపీ పాలనకు చరమగీతం పాడవలసిన అవసరం ఎంతైనా ఉందని.. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసి తలరాతలు మార్చుకోవాల్సిన రోజులు దగ్గరపడ్డాయని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు తెలిపారు. ఆదివారం రాత్రి మండలంలోని పోతుమర్రు గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమూరు పార్టీ కార్యాలయం నుంచి జంపని మీదుగా పోతుమర్రు గ్రామానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ర్యాలీతో ఆనందబాబుకు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో ఆయన చేతుల మీదుగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రచార రథంపై నుంచి ఎన్నికల ప్రచారం చేస్తూ వృద్ధులైన వారిని స్వయంగా పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం కోసం గా టీడీపీ జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకుందన్నారు. ప్రస్తుత పరిస్థితులను ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకుని చైతన్య వంతులై ఓటును సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఎమ్మెల్యేగా తనను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి అనురాధ, టీడీపీ నాయకులు వల్లూరు సుబ్రహ్మణ్యం, కూచిపూడి రవిబాబు, షేక్ హనీఫ్, గోసే రవి శివశంకర్, కొలకలూరి ప్రసాదు, గోసే సురేష్, రమేస్, నియోజకవర్గంలోని అనేక గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆనందబాబుకు ఘనంగా స్వాగతం పలికి శాలువలతో సత్కరించారు.

మసీద్‌లో ఏసీల ఏర్పాటుకు ఎమ్మెల్యే ఆర్థిక వితరణ

- రూ.50 వేలు అందజేత


మసీద్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏసీల కొనుగోలుకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే సోదరుడు శివప్రసాద్

చెరుకుపల్లి, మార్చి 10: పవిత్రమైన రంజాన్ మాసం ప్రతి ఒక్కరిలో సోదరభావానికి నిదర్శనమని ఎమ్మెల్యే అనగాని శివప్రసాద్ అన్నారు. గుళ్ళపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మక్కా మసీదు ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలతో ప్రార్థనలో ఆయన పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలకు అత్యంత పవిత్రమైన పండుగ రంజాన్ అని ఈ పండుగ దేశంలోనే ప్రాంతాలకు మతాలకు అతీ తంగా ప్రతి ఒక్కరిలో సోదరభావాన్ని పెంపొందిస్తుందన్నారు. నూతనంగా నిర్మించిన మసీద్‌లో నిత్యం జరుపుకునే ప్రార్థనల సౌకర్యం కోసం ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సహకారంతో ఏసీల ఏర్పాటు నిమిత్తం రూ.50వేల నగదును ఎమ్మెల్యే సోదరుడు శివప్రసాద్ మత పెద్దలకు అందజేశారు. అదేవిధంగా నియోజకవర్గానికి పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమార స్వామి, తనవంతుగా రూ.20వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉప్పాల సాంబశివరావు, మీర్జా అజీముద్దీన్‌బాబు, మహ్మద్ జీయా, వంగరు చక్రవర్తి శొంతి సుబ్బయ్య, వీరంకి శివ, గూడారు వెంకయ్య పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.


మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టీడీపీ మహిళా నాయకులు

వాడవాడలా మైఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ కార్యక్రమం

బాపట్ల, మార్చి 10 : బాపట్ల పట్టణంలోని వాడవాడలా మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. టీడీపీ బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ ఆధ్వర్యంలో ఆదివారం 5వవార్డు 51వ పోలింగ్‌బూత్ పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేగేశన నరేంద్రవర్మ కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కొత్తఓట్లు ఎన్‌రోల్ చేశారు. కార్యక్రమం లో వార్డు అధ్యక్షుడు నక్కల సీతారామయ్య, నియోజకవర్గ మహిళా అధ్యక్షురా లు చెన్నుపాటి హైమావతి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారామెడికల్ ఔట్‌సోర్సింగ్ జిల్లా అధ్యక్షుడిగా వెంకట్రావు

బాపట్ల, మార్చి 10: పట్టణంలోని ఏరియా వైద్యశాల నందు ఆదివారం బాపట్ల జిల్లా పారామెడికల్ ఔట్‌సోర్సింగ్ కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఆవుల వెంకట్రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పారామెడికల్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు వేమవరపు రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని జిల్లా కార్యదర్శిగా కె.పార్థసారధి, కోశాధికారి సాయి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరి ఎం వాణిశ్రీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా బి.రాజకుమారి, ఎం సుబ్బమ్మలను ఎన్నుకొని నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు మాట్లాడుతూ అసోసియేషన్ సిద్ధాంతాలకు, ఆదర్శాలకు పునరంకితమవుతానని తెలిపారు. నీతి, నిజాయితీ, నిబద్ధత క్రమశిక్షణ, చిత్తశుద్ధితో పని చేస్తానని ప్రతిజ్ఞ చేశారు.


ఆవుల వెంకట్రావుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న రమేష్ తదితరులు

సావిత్రిబాయిపూలేకు ఘన నివాళి

బాపట్ల, మార్చి 10 : సావిత్రిబాయిపూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం మండలపరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని పూలే దంపతుల విగ్రహాల వద్ద నిర్వహించారు. బహుజన టీచర్స్ అసోసియేషన్, వీసీకే ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పూలే దంపతుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బడుగు కిషోర్, నన్నం సురేష్‌బాబు, రేగుల గడ్డ చంద్రశేఖర్, యెనుముల భాస్కర్‌గౌడ్, ఉప్పాల వెంకటేశ్వర్లు, ఎకె.రాజు, కత్తి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లు చోరీ

కొల్లూరు, మార్చి 10: మండల పరిధిలోని చినపులివర్రు, బొద్దులూరుపాడు గ్రామాలపరిధిలో ఉన్న పంట పొలాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఆదివారం మొక్కజొన్న పొలాల కు నీటి తడులు అందించేందుకు వెళ్లిన రైతులకు మోటార్లు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ఆయా పంట పొలాలను ఏఎస్‌ఐ అర్జున్ పరిశీలించి ఐదుగురు రైతుల మోటార్లు చోరీకి గురయ్యాయని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేసిన బీజేపీకి బుద్ధి చెప్పాలి

- సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్

బాపట్ల, మార్చి 10: ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేసిన బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలు ఢిల్లీ వెళ్ళి మోదీ, అమిత్‌షాలకు సాగిలపడి 5కోట్ల ఆంధ్రుల గౌరవాన్ని తాకట్టుపెట్టటం శోచనీయమన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారసభ తిరుపతి వేదికగా నరేంద్రమోదీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్‌పార్టీ తీరని అన్యాయం చేసిందని, కేంద్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌ను అన్నివిధాలా ఆదుకుంటామని 10 సంవత్సరాలు ప్రత్యేకహోదా, కడపకు ఉక్కుకార్మాగారం ఏర్పాటు చేస్తామని, వెనుకబడిన ఉత్తరాంధ్రకు రైల్వే జోన్ ప్రకటిస్తామని, పోలవరం పూర్తి చేస్తామని ప్రత్యేక ప్యాకేజిలంటూ ప్రకటించి ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని, వైసీపీని ఇంటికి పంపి ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు మామిడిబత్తుల అశోక్, దేవేంద్రరెడ్డి, కంచర్ల ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ప్రసాదం, మజ్జిగ పంపిణీ

బాపట్ల, మార్చి 10: మండలంలోని అప్పికట్ల గ్రామంలో ఉన్న శ్రీగంగా అన్నపూర్ణా విశాలాక్షి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా అప్పికట్ల, భర్తీపూడి, గ్రామాల్లోని నందమూరి, పరిటాల యువసేన ఆధ్వర్యం లో భక్తులకు ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు. ఆదివారం విద్యుత్‌ప్రభలతో ఊరేగింపు చేశారు. ఇనగంటి రామకృష్ణయ్య కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో శని, ఆదివారం భక్తులకు అల్పాహారం, తాగునీటిని పంపిణీ చేశారు. ఆంధ్రరాష్ట్రాని కి చంద్రబాబునాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావాలని 101 కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మానం విజేత, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహర్షి ఆశ్రమగోశాలలో చండీయాగం

బాపట్ల, మార్చి 10: మండలంలోని మహర్షిఆశ్రమ గోశాలలో మాఘమా సం ఆదివారం అమావాస్య సందర్భంగా మహాచండీ యాగం నిర్వహించారు. ఉదయం మహామండపారాధన పూజానంతరం సర్వదేవతా గోమాత పూజ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో బి.బాబునాగేంద్ర, వీఎస్ నారాయణభట్టు, మలిశెట్టి భ్రమరాంబ, శ్యామలాదేవి, భాగ్యలక్ష్మి, మామిడి రాజశేఖర్, సురేంద్రచౌదరి, యామిని, రాఘవేంద్ర చౌదరి, పేరాల శేషగిరి, బంర్రెడ్డి రజనీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వరస్వామి రథోత్సవం

బాపట్ల, మార్చి 10 : మండలంలోని అప్పికట్ల గ్రామంలో ఉన్న గంగా అన్నపూర్ణా విశాలక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం నందు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి దేవాలయం నుంచి గ్రామంలోకి ఉత్సవంగా వెళ్లిన రథం రాత్రి నిద్ర చేసి ఆదివా రం ఉదయం గ్రామం నుంచి దేవాలయానికి ఊరేగింపుగా రథాన్ని తీసుకెళ్ళా రు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నీరాజన మంత్రపుష్పాలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తజనం అధికసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నంబూరి రామలింగేశ్వరశర్మ, నూతలపాటి శశిధర్‌శర్మ, నిమ్మగడ్డ రవికుమార్, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.


అప్పికట్ల గ్రామం నుంచి రథాన్ని తిరిగి దేవాలయానికి తీసుకెళుతున్న భక్తులు

బస్సులన్నీ సిద్ధం సభకు..

- ఆటోలను ఆశ్రయించిన ప్రయాణికులు
- తాయిలాలు ఎరవేసి బస్సులు ఎక్కించిన వైసీపీ నాయకులు


బాపట్ల పాతబస్టాండ్‌లో ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

బాపట్ల, మార్చి10: ఆర్టీసీ డిపో పరిధిలోని సర్వీస్‌లతోపాటు ప్రైవేట్ సర్వీస్‌లు కూడా సిద్ధం సభకు తరలించారు. శనివారం సాయంత్రం నుంచే నాయకులు బస్సులను తమ ఆధీనంలోకి తీసుకొని ఆయా గ్రామాలకు పంపించారు. ఆదివారం మధ్యాహ్నం వరకు బస్సుల్లో జనాన్ని తరలిస్తూనే ఉన్నారు. దీనివల్ల ఆర్టీసీ సర్వీస్‌లు అందుబాటులో లేక ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. ఆటోలను ఆశ్రయించారు. అవసరానికి సరిపడిన ఆటోలు లేక ప్రయాణానికి ఆటంకంగా మారి ప్రయాణికులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. బాపట్ల డిపో పరిధిలో 44 సర్వీస్‌లు ఉన్నప్పటికి ఒక్కసర్వీస్ కూడ ప్రయాణికుల అవసరాలకు కేటాయించలేదు. కేవలం సిద్ధం సభ కోసమే బస్సులు ఉన్నట్లు మొత్తం తరలించారు. మూడురోజులు సెలవుల అనంతరం వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు తిరిగి సోమవారం విధులకు హాజరయ్యేందుకు ఆదివారం సాయంత్రం తిరుగు ప్రయాణానికి బస్సులు లేక ఆటోలు, బాడుగకార్లల్లో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా ఈ విషయమై వివరణ అడిగేందుకు ఆర్టీసీ డీఎం కోసం ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేకుండా పోయారు.

ప్రతిబస్సుకు 12వేలు..

సిద్ధం సభకు వచ్చేవారికి ప్రతి బస్సుకు రూ.12వేల చొప్పున అందించినట్లు సమాచారం. బస్సులో ఎంత మంది వచ్చిన 12వేల రూపాయలతో సర్దుకోవాల్సిందే, కొన్నిచోట్ల ఒక్కొక్కరికి 500 రూపాయలు, భోజనం అందించినట్లు గ్రామాల్లో ప్రచారం జరుగుతున్నది.

డిపోలో ఉన్న 70 ఆర్టీసీ బస్సులూ సభకే..


నిర్మానుష్యంగా ఉన్న రేపల్లె బస్టాండ్

రేపల్లె, మార్చి 10: ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు లేకపోవటంతో తీవ్ర ఇక్కట్లు పడ్డారు. బస్టాండ్‌లోని గంటల తరబడి వేచిచూసి బస్సులు లేకపోవటంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు వెళ్లారు. రేపల్లె పట్టణంలో ఆర్టీసీ బస్సులన్నీ బాపట్లలో జరిగే మేదరమెట్లలో జరిగే సిద్ధం సభకు డిపోలో ఉన్న 70 ఆర్టీసీ బస్సులన్నీ తరలివెళ్లాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రేపల్లె నియోజకవర్గంలోని ప్రవేటు పాఠశాల్లోని బస్సులు ఆర్టీసీ బస్టాండ్‌లోని బస్సులన్నీ నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వలంటీర్లు దగ్గర ఉండి బస్సుల్లో ఎక్కించి వైసీపీ నాయకులను తరలించారు. దీంతో ప్రయాణికులు విషయం తెలియక బస్టాండ్‌కు రావటంతో బస్సుల కోసం వేచి చూసి కొంత మంది ఇళ్ళకు ప్రయాణం కాగా మరికొంతమంది గంటల తరబడి వేచి యుండి ఆటోలు, తదితర వాహనాల ద్వారా ఇబ్బందులు పడుతూ ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఆటో వారు అధిక రెట్లు ప్రయాణికుల నుంచి వసూలు చేశారు. మహాశివరాత్రికి సొంత గ్రామాలకు పలు ప్రాంతాల నుంచి ఇళ్ళకు రావటంతో బస్సులు లేక తిరుగు ప్రయాణానికి నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం పది బస్సులన్న ప్రధాన పట్టణాలకు చేరే విధంగా ఉంటే బాగుండేదని ఇలా ప్రయాణికులను ఇబ్బంది పెట్టటం ఏమిటంటూ ఆర్టీసీ యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులు ఆదేశించటంతో తప్పని సరి పరిస్థితుల్లో బస్సులు పంపించామంటూ మేము ఉద్యోగులమే కదా అని వాపోయారు. వైసీపీ ప్రభుత్వం చేసే అరాచకాలు సృష్టి పలకపోతే రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందంటూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

తాయిలాలు ఎర వేసి బస్సులు నింపారు


బస్సు నిండకపోవడంతో వలంటీర్లకు ఫోన్ చేసి మహిళలను బస్సు వద్దకు పంపించాలని చెబుతున్న వైసీపీ నాయకులు

కొల్లూరు, మార్చి 10: సిద్ధం సభకు భారీగా ప్రజలను తరలించాలనే ఉద్దేశంతో తాయిలాలు ఎర వేసి వైసీపీ నాయకులు బస్సులు నింపారు. కొల్లూరు మండలంలో ముఖ్యమంత్రి సభ కోసం మహిళలు, ప్రజలను తరలించేందుకు వారం రోజులుగా వైసీపీ నియోజకవర్గ నేత ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, యానిమేటర్లు, వలంటీర్లతో సమావేశాలు నిర్వహించి భారీ జనసమీకరణ చేయాల్సిన బాధ్యత మీదేనంటూ వారిపై ఒత్తిడి తీసుకువచ్చారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ కూలీలను, యానిమేటర్లు డ్వాక్రా మహిళలను, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి సభకు బస్సులు పెట్టారని, ఇంటికి కనీసం ఒకరైనా బస్సు ఎక్కాలని కోరగా మరో వైపు వైసీపీ నేతలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా మీకు ఎంతో లబ్ధి చేకూరిందని, ఎప్పుడన్న నిర్వహించే ముఖ్యమంత్రి సభలకు కూడా రారా అంటూ లబ్దిదారుల వద్దకు వెళ్లి చెబుతూ సభకు వచ్చిన వారికి తగిన ప్రతిఫలం అందజేస్తామని చెప్పడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వారు ఊ కొట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. సభకు వచ్చే వారికి అల్పాహారం, క్వార్టర్ సీసా, వాటర్ బాటిల్, శీతల పానీయం, అరటి గెలలు బస్సుల్లో ఏర్పాటు చేశారు. మధ్యలో వేటపాలెం వద్ద హాల్ట్ ఏర్పాటు చేసి అక్కడ సిద్ధం సభకు వచ్చే వారికి నియోజకవర్గ సమన్వయకర్త ఆధ్వర్యంలో బిర్యాని, క్వార్టర్ బాటిల్ తదితర వాటిని అందిస్తామని వైసీపీ శ్రేణులు పురుషులు, మహిళలను బస్సులో ఎక్కించి మరీ సిద్ధం సభకు తరలివెళ్లారు.

- అద్దంకిలో జరిగే సిద్ధం సభ కోసం ప్రజలను తరలించేందుకు వైసీపీ ప్రభుత్వం బస్సులను ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. ఎంతకీ బస్సులు రాకపోవడంతో స్టేజీల వద్ద ఉన్న ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించక తప్పలేదు. ఇదే అదునుగా ఆటోవాలాలు అధిక ధరలు వసూలు చేసినట్లుగా ప్రయాణికులు వాపోయారు.

పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలి

- మానసిక వైద్యనిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు

బాపట్ల, మార్చి 10 : పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సోషల్ మీడియాకు సాధ్యమైనంత దూరంగా ఉంచాలని ప్రఖ్యాత మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు తెలిపారు. ఆదివారం ఏకోహౌస్‌లో మానవతా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పిల్లలపై సమాజ ప్రభావం కూడా అధికంగా ఉంటుందని తెలిపారు. అటువంటి పరిస్థితుల్లో వారికి మంచి,చెడులు గురించి చెప్పాల్సిన బాధ్యత, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. కార్యక్రమానికి మానవతా బాపట్ల శాఖా అధ్యక్షుడు డాక్టర్ బి.శరత్ బోస్ అధ్యక్షత వహించగా డాక్టర్ ఇనజకుమారి, డాక్టర్ మీనా, యోగాశిక్షకులు శైలజ, పద్మజ, అనంతకుమారి, ప్రసన్న, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా డాక్టర్ ఇనజకుమారిని సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

'సిద్ధం'పై నిరాసక్తత

- సీఎం సభకు ఆసక్తిచూపని వైసీపీ కార్యకర్తలు
- పలుగ్రామాల నుంచి ఖాళీ సీట్లతో వెళ్లిన బస్సులు
- డుమ్మా కొట్టిన వైసీపీ మండల కన్వీనర్ శంకర్

బల్లికురవ, మార్చి 10: వైసీపీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సిద్ధం సభకు బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో ఆపార్టీ కార్యకర్తలు ఆసక్తి చూపలేదు. ప్రభుత్వం అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులను పంపించింది. మేదరమెట్ల వద్ద జరిగే సభకు వెళ్లే కార్యకర్తలకు బిర్యాని ప్యాకెట్లతో పాటు తాగే వారికి మందు బాటిళ్లను కూడా అందించారు. అయినప్పటికీ కొన్ని గ్రామాల నుంచి బస్సులలో సరిపడ కార్యకర్తలు ఎక్కక పోవటంతో ఖాళీగానే సభకు తరలి వెళ్లాయి. కొన్ని బస్సులలో అయితే బిర్యాని తింటూ కార్యకర్తలు తరలివెళ్లారు. వైసీపీ నేతలు గ్రామాలలో ఎంత బ్రతిమిలాడిన ప్రజలు బస్సులు ఎక్కేందుకు ఇష్టపడలేదు. కొన్నిగ్రామాలకు పెద్ద ఎత్తన బస్సులు ఏర్పాటుచేశారు. కొన్ని బస్సులు కార్యకర్తలు లేక అర కొరతో తరలివెళ్లాయి. ఉదయం 8 గంటలకు బస్సులు వచ్చినా సాయంత్రం వరకు కొన్ని కదలలేదు. కొందరు సభ దగ్గరకు వెళ్లకుండానే మధ్యలోనే వెనుదిరిగారు.

సిద్ధం సభకు డుమ్మా..

మేదరమేట్ల వద్ద వైసీపీ నిర్వహించిన సిద్ధం సభకు వైసీపీ బల్లికురవ మండల కన్వీనర్ ముద్దపాటి శంకర్ గైర్హాజరయ్యారు. మల్లాయపాలెం గ్రామానికి చెందిన ముద్దపాటి శంకర్‌ను వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి పది రోజుల క్రితం మండల కన్వీనర్‌గా నియమించారు. బాధ్యతల స్వీకరణ వేడుకలు కూడా ఎంతో ఆర్భటంగా నిర్వహించారు. ఏమి జరిగిందో ఏమోగాని గత రెండు రోజుల నుంచి శంకర్ సెల్‌ఫోన్‌ను స్విచ్‌ఆఫ్ చేసుకొన్నాడు సిద్ధం సభకు జగన్ హాజరవుతున్నా ఆయన వెళ్లక పోవటం మండలంలో చర్చనీయాంశమైంది. అయన అనుచరులు కూడా బస్సులు ఎక్కకపోవటంతో కార్యకర్తలు లేక వెలవెలబోయాయి.

అలాగే, వైసీపీకి చెందిన నక్కబొక్కలపాడు సర్పంచ్ దూళిపాళ్ల బుల్లిరామయ్య కూడా సిద్ధం సభకు దూరంగా ఉన్నాడు. తన అనుచరులు కూడా సభకు వెళ్లలేదు. వల్లాపల్లి, చెన్నుపల్లి గ్రామాలకు చెందిన వైసీపీలో ఉన్న ద్వితీయ శ్రేణి నేతలు కూడా సభకు డుమ్మా కొట్టారు.



బల్లికురవ మండలం నుంచి అరకొరగా కార్యకర్తలతో సిద్ధం సభకు తరలిన బస్సులు

బస్సు నుంచి జారిపడి యువకుడు మృతి



మృతి చెందిన గేదెల బాలదుర్గారావు

అద్దంకి, మార్చి 10: మేదరమెట్ల సమీపంలో జరిగిన సిద్ధం సభకు వచ్చిన యువకుడు తిరిగి వెళ్లే సమయంలో బస్సులో నుంచి జారిపడి అక్కడిక్కడే మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. నర్సరావుపేట పట్టణంలోని స్టేడియం ఎదురు చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన గేదెల బాల దుర్గారావు(27) ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓ ప్రయివేట్ కళాశాల బస్సులో మేదరమెట్ల సమీపంలో జరిగిన సిద్ధం సభకు హాజరయ్యారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి సభ జరిగే సమయంలోనే దుర్గారావు వచ్చిన బస్సు తిరుగు ప్రయాణమైంది. అద్దంకి మండలం గోపాలపురం వద్దకు వచ్చేసరికి బస్సులో గేటు వద్ద నిలబడి ఉన్న బాలదుర్గారావు జారి కిందపడ్డాడు. దీంతో అతనిపై గుండా అదే బస్సు వెనుక టైర్లు వెళ్లటంతో తల నుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. దుర్గారావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. దుర్గారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైసీపీ కార్యకర్తల దాడిలో యువకుడికి గాయాలు



గాయపడిన చక్రవర్తి

పంగులూరు, మార్చి 10: సిద్ధం సభకు రానని చెప్పడంతో వైసీపీ కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేశారు. మండలంలోని రామకూరులో ఆదివారం జరిగిన ఈ ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. మేదరమెట్ల సమీపంలో ఏర్పాటుచేసిన సిద్ధం సభకు ప్రత్యేక బస్సులలో వైసీపీ కార్యకర్తలు బయలుదేరారు. ట్రాక్టర్ నడుపుతూ గ్రామంలో మంచినీరు తాగేందుకు ఆగిన తలారి ధనచక్రవర్తిపై పార్టీ జెండాలున్న కర్రలతో వైసీపీ కార్యకర్తలు దాడిచేయడంతో గాయపడ్డాడు. గాయపడిన ధనచక్రవర్తిని చికిత్స నిమిత్తం ఉపసర్పంచ్ పెడవల్లి అశోక్, మరికొందరు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సిద్ధం సభకు రమ్మని కోరగా తాను నిరాకరించాడంతో తలపై కర్రతో మోది గాయపరిచారని ధనచక్రవర్తి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గతంలో వైసీపీలో ఉన్న ధనచక్రవర్తి మూడేళ్ల క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికలలో ఆ పార్టీకి దూరమైనట్లు సమాచారం.

నలుగురికి నోటీసులు

చినగంజాం, మార్చి 10: కొరిశపాడు మండలం గుడిపాడు వద్ద జరిగే సిద్ధం సభలో పాల్గొనరాదని మండలంలోని నలుగురికి చినగంజాం పోలీసులు నోటీసులు అందజేశారు. మండలంలోని కడవకుదురుకు చెందిన సీపీఎం నాయకుడు గన్నమనేని ప్రతాప్‌కుమార్, జనసేన మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు, సోపిరాలకు చెందిన వైసీపీ నాయకుడు అనుమాలశెట్టి శ్రీరామకృష్ణ, చినగంజాంకు చెందిన మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మేడికొండ సునీల్‌కు శనివారం రాత్రి పోలీసులు నోటీసులు అందజేసి, ఆదివారం ఉదయం బైండోవర్ చేశారు. సిద్ధం సభలో పొల్గొని ఏదైనా చట్ట వ్యతిరేక కార్యక్రమలు జరగకుండా ఉండేనిమిత్తం ముందు జాగ్రత్తచర్యలో భాగంగా నోటీసులు అందజేశారు. మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై సిద్ధం సభలో ప్లకార్డులను ప్రదర్శిస్తామనే భయంతో నోటీసులు జారీచేసి భయభ్రాంతలకు గురిచేయడం అన్యాయమని ప్రతాప్‌కుమార్, శ్రీనివాసరావు పేర్కొన్నారు.

'సిద్ధం' కష్టాలు



ఢీకొన్న వ్యాను, బస్సు

- ట్రాఫిక్ మళ్లింపుతో వాహనచోదకుల అవస్థలు
- సరైన పార్కింగ్ స్థలాలు లేక సభకు వచ్చిన వాహనదారులు, ప్రజల ఇబ్బందులు



జాతీయ రహదారిపై నిలిచిపోయిన సిద్ధం సభకు వచ్చిన బస్సులు

మేదరమెట్ల/అద్దంకి, మార్చి 10: సిద్ధం సభను మేదరమెట్ల సమీపంలో జాతీయ రహదారి వెంబడే ఏర్పాటు చేయటంతో ఆదివారం జాతీయరహదారి పై సుమారు పది గంటలపాటు ట్రాఫిక్‌ను ఇతర మార్గాలకు మరల్చారు. ఇక సిద్ధం సభకు వేల సంఖ్యలో బస్సులు ఏర్పాటుచేసినప్పటికీ సరైన పార్కింగ్ స్థలాలు ఏర్పాటుచేయకపోవటం, పార్కింగ్ స్థలాలలో వాహనాలు సరైనరీతిలో నిలపకపోవటంతో సభకు వచ్చిన జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుదూరప్రాంతాల నుంచి వచ్చిన జనం తీరా సిద్ధం సభ వద్దకు వెళ్లే అవకాశం లేకపోవటం, సభాస్థలం ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులు పడ్డారు. వీటన్నింటికి మించి జనం వచ్చిన బస్సులను మేదరమెట్ల, కొరిశపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జిల సమీపంలో, నామ్ రోడ్డులో బొడ్డువానిపాలెం సమీపంలో రోడ్లపైనే నిలిపివేయటంతో ట్రాఫిక్ కష్టాలు కనిపించాయి. ఎక్కడికక్కడే వాహనాలు రోడ్లపైనే నిలపటంతో వాహనదారులు తిరుగు ప్రయాణంలో మరింత ఇబ్బంది పడ్డారు. సిద్ధం సభ ఆరు గంటల సమయానికి ముగిసినా ట్రాఫిక్ రాత్రి పొద్దుపోయే వరకు క్లియర్ కాలేదు. ఇక దూర ప్రాంతాల నుంచి వచ్చిన జనానికి వాళ్ళు వచ్చిన బస్సులు ఎక్కడ నిలిపిఉంచారో అర్థం కాక మరింత ఇబ్బంది పడ్డారు.

ఇక ఆర్టీసీ బస్సులను అత్యధిక శాతం సిద్ధం సభకు కేటాయించటంతో ప్రయాణికులు మరిన్ని కష్టాలు పడ్డారు. అద్దంకి నియోజకవర్గంలో జనాన్ని తరలించేందుకు సుమారు 400 ఆర్టీసీ బస్సులు కేటాయించగా అత్యధిక శాతం బస్సులు తూర్పుగోదావరి జిల్లాల నుంచి పంపించారు. అద్దంకి పట్టణంతో పాటు కొరిశపాడు మండలం, పంగులూరు మండలంలోని అత్యధిక శాతం గ్రామాలకు సిద్ధం సభావేదిక 5 నుండి 20 కి.మీ దూరం మాత్రమే ఉంది. అయినప్పటికీ సుమారు 350 కి.మీ దూరం ఉండటంతో రానుపోను 700 కి.మీ దూరం ఆ బస్సులు ప్రయాణించేసి వచ్చి ఇక్కడ ప్రజలను తరలించేందుకు కేటాయించటం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. డీజిల్‌తో పాటు ఇతర ఖ ర్చులు కూడా వృధా అయ్యాయన్న విమర్శలు వస్తున్నాయి. అదే సమయంలో అద్దంకి డిపో బస్సులను పల్నాడు జిల్లాలోని గురజాల మండలానికి కేటాయించారు. ఇలా అటు బస్సులు ఇటు. ఇటు బస్సులు అటు కేటాయించటంతో వృధా ఖర్చు ఎక్కువగానే ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

సిద్ధం సభకు చీరాల నుంచి 500 బస్సులు

చీరాల, మార్చి 10: కొరిశపాడు మండలం పి.గుడిపాడు సమీపంలో ఆదివారం జరిగిన వైసీపీ సిద్ధం సభకు చీరాల నియోజకవర్గం నుంచి 500 బస్సుల్లో జనాలను తరలించినట్లు తెలిసింది. అయితే, మున్సిపల్ పరిధిలోని ఓ కౌన్సిలర్ చెప్పమన్నాడంటూ ఓవ్యక్తి వార్డులోని పలువురికి ఫోన్‌చేసి సభకు వచ్చేవారికి ఒక్కొక్కరికి రూ.300 ఇస్తారని, మద్యం అలవాటు ఉన్నవారికి మద్యం సీసా, అందరికి బిర్యానీ ప్యాకెట్లు అందజేస్తారంటూ చెప్పిన మాటల వాయిస్ రికార్డింగ్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

అది నిజంగా ఆ కౌన్సిలర్ అనుచరుడు చేసిన ఫోన్‌కాలా, లేకుంటే ఎవరన్నా ఉద్దేశ్యపూర్వకంగా చేశారా అనే విషయంలో రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తంమీద సభకు తరలివెళ్లిన వారికి తాయిలాలు బాగానే ముట్టజెప్పినట్లు తెలిసింది.

ప్రయాణికులకు తప్పని పాట్లు

- మండుటెండలో బస్సుల కోసం నిరీక్షణ
- అదనపు చార్జీలతో ఆటోల్లో ప్రయాణం



బస్సుల కోసం ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

పర్చూరు, మార్చి 10: కొరిశపాడు మండలం పిగుడిపాడు వద్ద ఆదివారం జరిగిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులను తరలించటంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో ఆయా ప్రాంతాలకు వెళ్ళేందుకు వచ్చిన ప్రయాణికులు పడరానిపాట్లు పడ్డారు. గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూసిన ప్రయాణికులకు సీఎం సభకు ఆర్టీసీ బస్సులను తరలించారన్న సమాచారం తెలియటంతో వారు పడిన అవస్థలు అన్నీఇన్నీకావు. ఉన్న అరకొర బస్సులతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. ఓ పక్క మండుటెండలు, మరో పక్క తాగటానికి చుక్కనీరు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పర్చూరు నుంచి ఆయా ప్రధాన పట్టణాలకు వెళ్ళేందుకు ప్రయాణికులు స్థానిక బొమ్మల సెంటర్‌లో మండుటెండలో నిరీక్షించారు. గత్యంతరం లేక అదనపు చార్జీలు వెచ్చించి ఆటోలో ప్రయాణాలు సాగించారు. రోజూ ఆర్టీసీ బస్సులతో రద్దీగా ఉండే పర్చూరు బస్టాండ్ వెలవెలబోయింది.



బస్సులు లేక ఆటోల్లో ప్రయాణం

జగన్ సభకు వెళ్ళే వాహనాలకే అనుమతి

పర్చూరు, మార్చి 10: సీఎం సిద్ధం సభ నేపథ్యంలో పర్చూరు నుంచి ఒంగోలు వెళ్ళే వాహనాలను చీరాల వైపు వెళ్ళేవిధంగా పోలీసులు ఆంక్షలు విధించారు. సిద్ధం సభకు వెళ్ళే వాహనాలను మాత్రమే ఈమార్గం ద్వారా అనుమతి ఇచ్చారు. దీంతో సిద్ధం సభకు లైన్ క్లియర్ అన్నట్లు ప్రజల నుంచి చర్చసాగింది. వాహనదారులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్పెషల్ పార్టీ పోలీసులు పర్చూరులో మోహరించారు. పోలీసులు బొమ్మల సెంటర్‌కు పెద్దఎత్తున చేరుకొని బందోబస్తు నిర్వహించటంతో ప్రజలు ఒకింత ఆందోళనకు గురయ్యారు. అసలు ఏమి జరిగింది... ఏమి జరగబోతుంది అన్న విధంగా వాతావరణం నెలకొంది. ఎక్కడో సీఎం సభ అయితే ఇక్కడ పెద్దమొత్తంలో పోలీసులను మోహరించటం ఏమిటని ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు.



పర్చూరు బొమ్మల సెంటర్‌లో భారీగా మోహరించిన పోలీసులు

ఎమ్మెల్యే ఏలూరి ఫ్లెక్సీ చించివేత



క్యాంపు కార్యాలయం వద్ద ఏలూరి ఫ్లెక్సీని చించివేసిన ఆగంతకులు

మార్టూరు, మార్చి 10: మండలంలోని ఇసుక దర్శిలోగల క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావుకు జన్మదిన శుభా కాంక్షలను తెలియచేస్తూ గతంలో వేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని ఆగంతకులు చించివేశారు. ఆదివారం జరిగిన ఈ సంఘటన పార్టీ కార్యకర్తలను, ఏలూరి అభిమానులను తీవ్ర మానసిక వేదనకు గురి చేసింది. మేదరమెట్ల వద్ద జరిగిన సిద్ధం సభకు వెళుతూ వైసీపీకి చెందిన కొంతమంది ఆగంతకులు ఈ దుందుడుకు చర్యలకు పాల్పడి ఉంటారని టీడీపీ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఫ్లెక్సీలను చించివేసి గొడవలకు ఆద్యం పోయాలనుకోవడం మంచి సంప్రదాయం కాదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

ఘర్షణలో పలువురికి గాయాలు

మార్టూరు, మార్చి 10: స్థానిక సంపత్ నగర్‌లో గల గ్రానైట్ పరిశ్రమలో భాగస్వాములుగా ఉన్న కోపూరి శ్రీనివాసరావు, తన్నీరు శ్రీనివాసరావు కుటుంబాల మధ్య ఆదివారం ఉదయం ఘర్షణ జరిగినట్లు తెలిసింది. వ్యాపారపరమైన విషయంపై మనస్పర్ధలు కారణంగా రెండు కుటుంబాలకు చెందిన వారు ఒక రిపై మరొకరు దాడి చేసుకున్నారు. దాంతో రెండు కుటుంబాలకు చెందిన కొంతమందికి గాయాలయ్యాయి. ఈ విషయమై వారిద్దరు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నట్లు తెలిసింది. పోలీసులు విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు.

115 మందికి వైద్యసేవలు

ఇంకొల్లు, మార్చి 10: మండలంలోని గంగవరంలో వైద్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 115 మంది రోగులకు వైద్య సేవలందించారు. గ్రామానికి చెందిన బోడెంపూడి రాధాకృష్ణమూర్తి, జరుబుల వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యుల సహకారంతో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎం. రమేష్‌బాబు, బోడావుల శ్వేతాశ్రీ, దుర్గాప్రసాద్ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్రనాయకులు వలేటి కృష్ణయ్య, సీఐటీయూ నాయకులు వై.సిద్ధయ్య, రామకోటేశ్వరరావు, వినోద్, నాగండ్ల వెంకట్రావు, వైద్యవేదిక కన్వీనర్ కరి బాలచంద్ర, కరి సృజన తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల భవిష్యత్తే చంద్రబాబు లక్ష్యం

- ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, మార్చి 10: తెలుగు ప్రజల భవిష్యత్తే లక్ష్యంగా చంద్రబాబు అడుగులు వేస్తున్నారని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం బెంగుళూరులోని ఎస్‌కేజీ కల్యాణ మండపంలో పర్చూరు ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విధ్వంసం, అరాచకం, దోపిడీ పాలనలో రాష్ట్రం ధ్వంసం అయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల బావితరాల కోసం చంద్రబాబు అలుపెరగని పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఆయనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీల కలయిక చరిత్రాత్మకమైందన్నారు. రాష్ట్రం ప్రగతి కోసం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలందరూ ముక్తకంఠంతో హర్షిస్తున్నారన్నారని చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న క్లిష్టపరిస్థితుల ఆధారంగా అధినేత చంద్రబాబు పొత్తు నిర్ణయం తీసుకున్నారన్నారు.

జగన్ రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడిందని ఎమ్మెల్యే సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చింది వైసీపీ ప్రభుత్వమేనన్నారు. బీసీలు, ఎస్టీలు, ఎస్సీలపై దాడులు జగన్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగాయన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు దార్శనిక పాలన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రక్షణగా ఉంటుందన్నారు. ప్రతి ఓటరు రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకొని రాష్ట్ర ప్రగతికి తమ వంతు కర్తవ్యంగా పనిచేయాలన్నారు. ఓటు అనే ఆయుధంతో ఆరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. అక్రమ మార్గంలో గెలవాలనే కుట్రతో వైసీపీ ప్రభుత్వం ఓట్లు తొలగింపునకు కుట్రలు పన్నిందని చెప్పారు. ఈసందర్భంగా జరిగిన పరిణామాలను వివరించారు. వైసీపీ ఓట్లు తొలగింపు అక్రమ మార్గాన్ని చాకచక్యం తో తిప్పికొట్టామన్నారు. యువ ఓటర్లు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌కోసం ఓటు వేయాలన్నారు. వైసీపీ పతనానికి నూతన ఓటరు ఓటే నాంది పలకాలన్నారు.

బెంగుళూరులో జరిగిన పర్చూరు నియోజకవర్గ వాసుల ఆత్మీయ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు ఘనస్వాగతం లభించింది. ప్రాంగణానికి చేరుకున్న ఏలూరిని పర్చూరు వాసులు ఆత్మీయ పలుకరింపుతో అభిమానం చాటుకున్నారు. పెద్ద ఎత్తున యువత ఏలూరి వద్దకు చేరుకొని గజమాలతో ఘనంగా సత్కరించారు. తొలుత మహిళలు హారుతులిచ్చి స్వాగతం పలికారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



గజమాలతో ఏలూరిని సత్కరిస్తున్న యువత

టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శిగా వేణుగోపాలరావు



పర్చూరు, మార్చి 10: తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా పర్చూరు మండలం అడుసుమల్లికి చెందిన అడ్డగడ్డ వేణుగోపాలరావు (వేణు)ను రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియమించినట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశిరావు తెలిపారు. ఈమేరకు ఉత్తర్వులు అందజేసినట్లు ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి ప్రకటించారు. న్యాయవాదిగా పనిచేస్తూ తెలుగుదేశం పార్టీలో క్రియాశీ లకంగా ఉన్న వేణుగోపాలరావును లీగల్ సెల్ కార్యదర్శిగా నియమించినట్లు తెలియజేశారు. ఈసందర్భంగా ఏలూరి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

వైసీపీలో నిరుత్సాహం

- క్యాడర్‌లో జోష్ నింపని 'సిద్ధం'
- ఆశించిన స్థాయిలో హాజరుకాని జనం



సీఎం సభ వద్దకు వెళ్ళకుండానే వెను తిరిగి మేదరమెట్ల వద్ద సేదతీరుతున్న మహిళలు

మేదరమెట్ల/అద్దంకి, మార్చి 10: సిద్ధం సభ వైసీపీ క్యాడర్‌లో జోష్ పెంచకపోగా నిరుత్సాహాన్ని నింపింది. మేదరమెట్ల సమీపంలో పి.గుడిపాడు వద్ద జాతీయ రహదారి సమీపంలో ఆదివారం సాయంత్రం సిద్ధం సభ జరిగింది. సభ లో బాపట్ల జిల్లాకు వరాల జల్లు కురిపిస్తారని ఆశించిన ప్రజలకు ఒకింత నిరుత్సాహమే మిగిలింది. అద్దంకి నియోజవర్గంలో వైసీపీ గెలుపును సీఎం జగన్మోహనరెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని స్థానిక వైసీపీ నేతలు అవకాశం వచ్చినప్పుడల్లా చెప్పుకుంటుండగా, అద్దంకి నియోజవర్గంలో జరిగిన సిద్ధం లోనైనా వరాల జల్లు కురిపిస్తారని భావించిన అద్దంకి నియోజవర్గ ఓటర్లకు పూర్తి నిరాశే మిగిలింది. సిద్ధం సభకు అత్యంత సమీపంలో వైసీపీ నేతలలో కీలక నేతగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి తండ్రి పేరుతో పనులు చేపట్టి అర్థంతరంగా నిలిచిపోయిన యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పనులు పూర్తిచేసే హామీ కూడా ఇవ్వకపోవటం క్యాడర్ లో మరింత నిరుత్సాహం నెలకొంది. సిద్ధం సభకు రావద్దని కొరిశపాడు మండలంలోని తూర్పుపాలెంకు చెందిన నలుగురు రైతులకు పోలీసులు ముందస్తు నోటీసులు అందించటం గ్రామస్థులను మరింత కలిసి వేసింది. పోలీసులు నోటీసులు ఇచ్చిన రైతులు వైవీ సుబ్బారెడ్డి కుటుంబానికి బంధువులు కూడా కావటం విశేషం. ఇలా ఏఒక్క విషయాన్ని కూడా ప్రకటించక పోవటం క్యాడర్ లో ఒకింత నిరుత్సాహం నెలకొంది.



ఒకవైపు సిద్ధం సభ వద్దకు వెళ్తున్న బస్సులు, మరో రోడ్డులో వచ్చిన జనంతో వెనుతిరిగి వెళ్తున్న బస్సులు

సభ ప్రారంభం కాకముందే వెనుదిరిగిన జనం

గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి జనాన్ని ప్రత్యేక బస్సులలో నానాతిప్పలు పడి తరలించారు. వైసీపీ నేతలు గత పక్షం రోజులుగా ఊదరగొట్టిన విధంగా 15 లక్షల మంది హాజరవుతున్నారని చెప్పిన మాటలు, ఆదివారం హాజరైన జనానికి భారీ వ్యత్యాసం ఉందని పలువురు అంచనా వేస్తున్నారు. భారీ సంఖ్యలో ఆర్టీసీ, కళాశాలల, పాఠశాలల బస్సులు ఏర్పాటుచేసి తరలించే ప్రయత్నం చేసినా ఐదో వంతు మందికి లోపుగానే హాజరై ఉంటారని అంచనా వేస్తున్నారు. సిద్ధం సభా ప్రాంగణంలో లక్ష మందికి మించి పట్టే పరిస్థితి లేదు. ఇక మిగిలిన జనం మొత్తం జాతీయ రహదారిపైనే ఉండిపోయారు. అత్యధిక శాతం మంది అయితే సభా వేదికకు సుమారు మూడు నుంచి 5 కి.మీ దూరం నుంచే కనీసం బస్సుల నుంచి కూడా దిగకుండానే వెనుతిరిగిపోయారు.

సిద్ధం సభ ప్రారంభానికి సుమారు గంట ముందు నుంచి దూర ప్రాంతాల నుంచి వచ్చిన జనం వెనుతిరిగి పోవటం ప్రారంభించారు. కొంతమంది అయితే ఎండ వేడిమికి సభా వేదిక వద్దకు వెళ్ళలేక సభా వేదిక నుంచి సుమారు 5 కి.మీ దూరంలోనే చెట్ల కింద సేద తీరారు. ఒంగోలు వైపు నుండి వచ్చిన పలు బస్సులు కొరిశపాడు, మేదరమెట్ల ఫ్లైఓవర్‌ల వద్ద నుంచే వెనుతిరిగాయి. సిద్ధం సభకు వచ్చే జనం కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేయటంతో పాటు పురుషులకు ఒక మద్యం బాటిల్, బిర్యానీ ప్యాకెట్ ఇచ్చారు. మహిళలకు కూల్‌డ్రింక్, బిర్యానీ ప్యాకెట్ సరఫరా చేశారు. ఇంతచేసినా పలు గ్రామాల నుంచి మాత్రం ఆశించిన స్థాయిలో జనం రాకపోవటంతో బస్సులు కనీసం సగం సీట్లలో కూడా జనం లేకుండానే సిద్ధం సభకు వచ్చాయి.

అద్దంకిలో ఆశించినస్థాయిలోలేక..

అద్దంకి పట్టణంలోని పలు వార్డులలో అయితే పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది. జనం లేకపోవటంతో బస్ డ్రైవర్‌లు ఆయా వార్డులలోని వైసీపీ నేతలకు ఫోన్‌లు కూడా చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో వెళ్ళలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలోని పలుగ్రామాలలో కూడా ఇదే పరిస్థితి కనపించింది. కొరిశపాడు మండలంలోని ఓ గ్రామంలో స్థానికంగా ప్రజలలో పెద్దగా స్పందన లేకపోవటంతో మిర్చి కోతలకు కర్నూలు నుంచి వచ్చిన కూలీలకు అన్ని సదుపాయయాలు కల్పించటంతో పాటు రూ.500 చొప్పున కూలీ ఇచ్చి బస్సులలో తరలించారు. బల్లికురవ మండలంలో ఇద్దరు, ముగ్గురు నేతలు అలకబూని సిద్ధం సభకు వెళ్లకుండా ఫోన్‌లు స్విచ్‌ఆఫ్ చసినట్లు తెలుస్తుంది. అద్దంకి నియోజకవర్గంలో స్థానిక క్యాడర్ ఆశించిన స్థాయిలో పనిచేయకపోవటంతో ఆశించిన స్థాయిలో జనాన్ని తరలించటంలో విఫలమయినట్లు తెలుస్తుంది. పంగులూరు మండలం రామకూరులో సిద్ధం సభకు రానన్నందుకు యువకుడిపై వైసీపీ శ్రేణులు దాడిచేశారు.

కార్యకర్తల తరలింపులో తంటాలు

మార్టూరు, మార్చి 10: మేదరమెట్లలో ఆదివారం జరిగిన సీఎం సిద్ధం సభకు మండలం నుంచి వైసీపీ నాయకులు పార్టీ కార్యకర్తలను, అభిమానులను బస్సులలో తరలించారు. ప్రతి బస్సులో వచ్చే వారికి భోజనం, తదితర ఖర్చుల నిమిత్తం నియోజకవర్గ వైసీపీ అధినేత నుంచి రూ.10 వేల వంతున పార్టీ నాయకులకు అందినట్లు తెలిసింది. దాంతో ఈ నాయకులు సభ కు వచ్చే వారికి బిర్యానీతో పాటు పురుషులకైతే మద్యం బాటిళ్లు, మహిళలకైతే రూ.200 వంతున నజరానా ఇచ్చినట్లు తెలిసింది. అందుకోసం రూ.10 వేలు సరిపోక పోవడంతో కొంతమంది స్థానిక నాయకులు ఎంతోకొంత చేతిసొమ్ము వినియోగించినట్లు సమాచారం.

యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో సిద్ధం సభ కోసం కార్యకర్తలను తీసుకెళ్లడానికి వచ్చిన ఆర్టీసీ బస్సులో ఎవరూ ఎక్కకపోవడంతో ఖాళీగా వెనక్కు వెళ్లిపోయినట్లు తెలిసింది. అలాగే, యద్దనపూడి గ్రామంలో ఒక వైసీపీ నాయకుడు కూడా ఎందుకనో తెలియదు గాని సొంతనిధులతో వాహనాలలో కార్యకర్తలను సిద్ధం సభకు తర లించినట్లు తెలిసింది. పెద్ద జాగర్లమూడిలో గ్రామానికి చెందిన ఒక వైసీపీ నాయకునికి బస్సులను పంపిం చినప్పటికీ వాటిలో వెళ్లకుండా ఎస్సీ కాలనీకి చెందిన వారు ప్రత్యేకంగా రెండు వాహనాలలో వెళ్లినట్లు తెలిసింది. ఈ మూడు గ్రామాలలో జరిగిన సంఘటనలు మండలంలో వైసీపీ కార్యకర్తలలో చర్చ నీయాంశమైంది.

సీఐటీయూ జెండా ఆవిష్కరణ

మార్టూరు, మార్చి 10: మండలంలోని బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు జెండాను ఆవిష్కరించారు. అనంతరం టోల్‌ప్లాజా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు యూనియన్‌గా ఏర్పడ్డారు. అధ్యక్షుడిగా రాజశేఖర్, కార్యదర్శిగా శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, కార్మికులు పాల్గొన్నారు.

నేడు యద్దనపూడిలో టీడీపీ, జనసేన కార్యకర్తల సమావేశం

యద్దనపూడి(మార్టూరు), మార్చి 10: యద్దనపూడిలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం ఆపార్టీ, జనసేన మండల కార్యకర్త సమావేశం జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు నల్లపనేని రంగయ్య చౌదరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

పుణ్యభూమి పుస్తకం ఆవిష్కరణ

అద్దంకి, మార్చి 10: కవయిత్రి ఐవీ సుబ్బాయమ్మ రచించిన పుణ్యభూమి పుస్తకాన్ని ఆదివారం స్థానిక నాగులబండ బజారులోని మారం సేవాసదన్ లో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఆవిష్కరించారు. ఈసందర్భంగా సాహిత్య మిత్రమండలి ఆధ్వర్యంలో సుబ్బాయమ్మను సన్మానించారు. కార్యక్రమంలో లక్కరాజు చంద్రశేఖర్, ఓరుగంటి శ్రీనివాసరావు, కుందా సుబ్బారావు, రఘురామశర్మ, గాడేపల్లి దివాకర్‌దత్, తదితరులు పాల్గొన్నారు.

మోటారుసైకిల్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

అద్దంకి, మార్చి 10: మోటార్‌సైకిల్ అదుపుతప్పటంతో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పల్నాడు జిల్లా శ్యావల్యాపురం మండలం వైకల్లుకు చెందిన పెదరోశయ్య సిద్ధం సభకు వచ్చి తిరిగి వెళ్ళే సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. అద్దంకి మండలం ధర్మవరం వద్ద ఆదివారం సాయంత్రం మోటార్‌సైకిల్ అదుపుతప్పి పడిపోవటంతో గాయాలయ్యాయి.